తిరుమలకు బ్రహ్మోత్సవ శోభ

▸ అధిక మాసం నేపథ్యంలో వరుసగా రెండు ఉత్సవాలు

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి ఏడాది పొడవునా నిర్వహించే ఉత్సవాల్లో బ్రహ్మోత్సవాలు ప్రధానమైనవి. అధికమాసంతో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు భక్తులను కనువిందు చేయనున్నాయి. చాంద్ర మానం ప్రకారం ప్రతీ మూడో ఏట అధికమాసం వస్తుంది. కన్యా మాసం(భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో(ఆశ్వయుజం)లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నవ రాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. సెప్టెంబరు 15 నుంచి 23 వరకు సాలకట్ల(వార్షిక) బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఉదయం వాహనసేవ 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి వాహన సేవ 7 నుంచి 9 గంటల వరకు, గరుడ వాహనసేవ సాయంత్రం 6.30 నుంచి 12 గంటల వరకు జరుగుతుంది.

- న్యూస్‌టుడే, తిరుమల

అంకురార్పణం..

వైఖానస ఆగమ క్రతువుల్లో అంకురార్పణం లేదా బీజవాపనం ముఖ్యమైంది. దీన్ని ఈ నెల 14న రాత్రి 7-8 గంటల మధ్య నిర్వహిస్తారు. శ్రీస్వామివారి సేనాధిపతి శ్రీవిష్వక్సేనులవారు వసంత మండపానికి ఊరేగింపుగా వెళతారు. అక్కడ భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి మన్నులో 9 రకాల ధాన్యాలు నాటుతారు. అంకురాలను ఆరోపింపజేసే ఈ కార్యక్రమం కాబట్టి ఇది అంకురార్పణ అయింది.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం..

బ్రహ్మోత్సవాలు, ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశికి ముందు మంగళవారం కోయిళ్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 8న ఉదయం 6 నుంచి 11 గంటల వరకు జరుగుతుంది. ఆనంద నిలయం మొదలు బంగారు వాకిలి వరకు, ఉపాలయాలు, పోటు, ఆలయ ప్రాంగణ గోడలు, పైకప్పు, పూజాసామగ్రి శుద్ధి చేస్తారు.

శ్రీవారి ఆలయం

ధ్వజారోహణం..

బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 6.21 నుంచి 6.35 గంటల వరకు జరుగుతుంది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి సమక్షంలో వేదగానాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేసి సకల దేవతలు, అష్టదిక్పాలకులను ఆహ్వానిస్తారు. అనంతరం వాహన సేవలు వైభవంగా ప్రారంభమవుతాయి.

పురాణ నేపథ్యం ఇలా..

శ్రీనివాసుడు వేంకటాద్రిపై వెలసిన తొలినాళ్లలోనే బ్రహ్మదేవుడిని పిలిచి లోకకల్యాణం కోసం తనకు ఉత్సవాలు నిర్వహించాలని ఆజ్ఞాపించారనేది పురాణగాథ. ఆ ప్రకారమే శ్రీవేంకటేశ్వరుడు ఆనంద నిలయం మధ్యలో ఆవిర్భవించిన కన్యా మాసం(ఆశ్వయుజం)లోని శ్రవణా నక్షత్రం నాటికి పూర్తయ్యేలా బ్రహ్మదేవుడు తొమ్మిది రోజులు ఉత్సవాలు నిర్వహించారు. అందుకే ఇవి 'బ్రహ్మోత్సవాలు'గా ప్రసిద్ధిచెంది నిరాటంకంగా కొనసాగుతున్నాయి.

సీఎం దూరదృష్టితోనే 30 ఏళ్ల వెలిగొండ కల సాకారం

రాయచోటి, న్యూస్‌టుడే: కరవు పీడిత ప్రాంతంగా ఉన్న మార్కాపురం ప్రజలు 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కలను నెరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కిందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. వెలిగొండ ప్రారంభోత్సవం చరిత్రాత్మక ఘట్టమన్నారు. 10.07 టీఎంసీల నీటిని విడుదల చేయడం రాష్ట్ర సాగునీటి చరిత్రలో కీలక మైలురాయిగా అభివర్ణించారు. వెలిగొండ ద్వారా 4.47 లక్షల ఎకరాలకు సాగునీరందుతుందని, తొలి విడత 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, నాలుగు లక్షల మందికి తాగునీరు అందుతుందన్నారు. భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం అండగా నిలవడంతో కల సాకారమైందన్నారు. 48 రోజుల్లోనే ఆయా కుటుంబాలకు రూ.762 కోట్లు పరిహారం పంపిణీ చేయడం సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. వ్యవసాయ రంగం బలోపేతం కావడం సహా ఆ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. రైతుల సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సీఎం చూపుతున్న చొరవ, దూరదృష్టి రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు అంకితం చేసిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

తూలుతూ.. తోలుతున్నారు

▸ ఇష్టానుసారంగా డ్రైవింగ్ ▸ మద్యం మత్తులో తరచూ ప్రమాదాలు ▸ కొరడా ఝుళిపిస్తున్న పోలీసులు

వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

జిల్లాలో మద్యం మత్తులో కొందరు ప్రజలు వాహనాల్లో మితిమీరిన వేగంతో వెళ్తూ తమ ప్రాణాల మీదకు తెచ్చుకోవడంతో పాటు బాధ్యతారహితంగా ఎదుటివారి ప్రాణాలు తీస్తున్నారు.. నిర్లక్ష్య డ్రైవింగ్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నా వాహన చోదకుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. . ముఖ్యంగా పట్టణ శివారుల్లో మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు.. వాహన చోదకులు అడుగడుగునా నిర్లక్ష్యం వహిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.. జిల్లాలో ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంది.. ఎక్కువ ఘటనల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. వాహనాలు ఎక్కువ వేగంగా నడపడం, మద్యం మత్తులో నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.. దీంతో తరచూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ జరిమానా విధిస్తున్నారు. జిల్లాలో ఎనిమిది నెలల్లో 11,01 కేసులు నమోదు కాగా.. 59,42,600 జరిమానా విధించారు. - న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు

ఇటీవలి ఘటనలు కొన్ని..

మదనపల్లెకు చెందిన శ్రీరాములు, వీరబల్లి మండలం తొగటవారిపల్లెకు చెందిన శశిధర్ సొంత పనిపై ఆగస్టు 14న చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం శంకరరాయలపేటకు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగొస్తుండగా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మద్యం మత్తులో కారు నడిపి రోడ్డు పక్కన నిల్చొన్న వారిని ఢీకొట్టారు. పుంగనూరు మండలం రాంపల్లె వద్ద జరిగిన ఘటనలో శశిధర్(20) చికిత్స పొందుతూ 16న మృతి చెందాడు. కారు నడుపుతున్న యువకుడిపై కేసు నమోదు చేశారు. ■ మదనపల్లెకు చెందిన ముగ్గురు యువకులు రెండు నెలల క్రితం ద్విచక్ర వాహనంపై కురబలకోట మండలం అంగళ్లకు వెళ్తూ నందిరెడ్డిగారిపల్లె సమీప మలుపులో అదుపుతప్పి పడి దుర్మరణం పాలయ్యారు. ■ ఏడాది క్రితం మదనపల్లెకు చెందిన ఆరుగురు యువకులు కర్ణాటకలో మద్యం తాగేందుకు వెళ్లి కారులో తిరిగొస్తూ మండలంలోని బార్లపల్లె వద్ద ఇద్దరు పాడిరైతులను ఢీకొట్టగా రైతులు మృతిచెందారు. గ్రామస్థులు పట్టుకుంటారనే భయంతో వేగంగా నడిపి ఎదురుగా వస్తున్న బోరు లారీని ఢీకొట్టగా కారులోని ఆరుగురిలో ముగ్గురు అక్కడికక్కడే చనిపోగా మరో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు. జిల్లాలో ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

జిల్లాలో ఎనిమిది నెలల్లో నమోదైన డ్రంకన్ డ్రైవ్ కేసుల వివరాలు

నెల	నమోదైన కేసులు	జరిమానా
జనవరి	214	12,35,500
ఫిబ్రవరి	120	7,33,750
మార్చి	116	5,96,750
ఏప్రిల్	191	10,75,000
మే	161	9,93. 850
జూన్	120	7,48,250
జులై	131	4,49,500
ఆగస్టు	48	1,10,000

తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు..

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్పీ ధీరజ్ ఆదేశానుసారం ప్రత్యేక తనిఖీలు చేస్తున్నాం. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఈ తనిఖీలు నిర్విరామంగా జరుగుతున్నాయి. ప్రతి స్టేషన్ పరిధిలో వీటిని క్రమం తప్పక నిర్వహిస్తున్నాం. తాగి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నాం. ఒక్కొక్కరికి రూ.11 వేలు చొప్పున జరిమానా విధిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, ప్రమాదాలు చేసినా వారిపై కఠిన చర్యలు తప్పవు. జిల్లాలో ప్రధాన రహదారులు సహా గ్రామీణ ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నాం. రెండు కంటే ఎక్కువసార్లు పట్టుబడితే జైలుశిక్ష పడుతుంది.

-ఎం.వెంకటాద్రి, ఏఎస్పీ

సెప్టెంబర్ నెలలో తిరుమలలో విశేష పర్వదినాలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో సెప్టెంబర్ నెలలో విశేష పర్వదినాలు జరగనున్నాయి. ఇందులో నాలుగో తేదీన శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం, 5న శ్రీవారి సన్నిధిలో శిక్యోత్సవం నిర్వహించనున్నారు. 13న బలరామ జయంతి, వరాహ జయంతి జరుగుతాయి. 14న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయగా 15 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం, ధ్వజారోహణం ఉంటాయి. 19న శ్రీవారి గరుడసేవ కనులపండువగా నిర్వహించనున్నారు. 20న శ్రీవారి స్వరథోత్సవం, 22న శ్రీవారి రథోత్సవం, 23న చక్రస్నానం, ధ్వజావరోహణం ఉంటాయి. 24న శ్రీవారి భాగ్ సవారి, 25న అనంత పద్మనాభ వ్రతం, చక్రస్నానం జరగనుంది.

కరవు.. మామిడి బరువు..

ఈ చిత్రాన్ని చూశారా.. ఖాళీ స్థలంలో మొదుళ్లు ఇలా అక్కడక్కడ పెట్టినట్లుగా ఉన్నాయేంటని ఆశ్చర్యపోతున్నారా.. ఇదేదో సినిమా కోసం వేసిన సెట్టింగ్ కాదు. ఎల్‌నినో జిల్లాపై విసిరిన పంజాకు కకావికలమైన మామిడి తోటల దుస్థితికి నిదర్శనం ఇది. జిల్లాలో మామిడి 35 వేల హెక్టార్లలో విస్తరించింది. ఖరీఫ్ మొదలు నేటివరకు చినుకు రాలకపోవడంతో వర్షాధారమైన ఈ తోటలు కళావిహీనంగా మారాయి. పచ్చగా కళకళలాడాల్సిన తోపు ఎండిపోవడంతో రైతు పరిస్థితి హృదయ విదారకంగా మారింది. 20 నుంచి 30 ఏళ్లకు పైగా వయసున్న చెట్లు నరికేస్తున్నారు. చిన్నమండెం మండలంలోని నేరెళ్లవంక, బంగారువాండ్లపల్లె, వండాడి ప్రాంతాల్లో పెద్దఎత్తున చెట్లు తొలగించడం గమనార్హం.

-న్యూస్‌టుడే, చిన్నమండెం

చెరువులకు హంద్రీ-నీవా జలాలు

▸ 40 వేల బోర్లు ఖాళీ

ఈనాడు, అన్నమయ్య: ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో కరవు ఛాయలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. వర్షాలు లేక జిల్లా వ్యాప్తంగా 40 వేల బోర్‌బావులు ఎండిపోవడంతో తీవ్ర తాగు, సాగునీటి ఎద్దడి ఏర్పడింది. నీటి చుక్క కోసం అల్లాడుతున్న పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులు దయనీయంగా మారుతున్నాయి. దీనిపై స్పందించిన జిల్లా యంత్రాంగం, భూగర్భజల మట్టాన్ని పెంచేందుకు హంద్రీ-నీవా సుజల స్రవంతి జలాల సరఫరాపై దృష్టి సారించింది. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు పరిసర ప్రాంతాల్లో ఎండిపోయిన బోరుబావులు, నెర్రలు బారిన పొలాలే కనిపిస్తున్నాయి. గతంలో వందల అడుగుల లోతులో నీరు పడిన ప్రాంతాల్లో ఇప్పుడు వేల అడుగులు తవ్వినా చుక్కనీరు రావట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జలవనరుల శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

తాగునీటి కొరతపై దృష్టి

భూగర్భజలాలు అడుగంటడంతో చెరువులు, రిజర్వాయర్లను హంద్రీ-నీవా నీటితో నింపడమే ఏకైక మార్గంగా అధికారులు భావిస్తున్నారు. మదనపల్లె పట్టణానికి ప్రధాన ఆధారమైన చిప్పిలి, గుడ్డివారిపల్లి ట్యాంకులను పూర్తి సామర్థ్యంతో నింపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. చిప్పిలి ట్యాంక్ సామర్థ్యాన్ని పెంచేందుకు తాత్కాలికంగా ఎత్తు పెంచుతున్నారు. తాగునీటి కొరత తీర్చేందుకు వెలిగల్లు రిజర్వాయర్‌ను కనీసం 50 శాతం నింపాలని తలచారు. ఇందుకు ప్రధాన కాలువ ద్వారా త్వరగా నీరు విడుదల చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

శరవేగంగా పనులు..

మదనపల్లెలోని అమ్మ చెరువును హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ నుంచి నీటిని లిఫ్ట్ చేసి నింపేందుకు పంపుసెట్లు ఏర్పాటు చేస్తున్నారు. హంద్రీ-నీవా నీరు తాగునీటికే వినియోగించేలా అధికారులు నిఘా ఏర్పాటు చేస్తున్నారు. కాలువల వెంట నీటి చౌర్యం జరగకుండా రేయింబవళ్లు పర్యవేక్షించేందుకు నియమించనున్న ప్రత్యేక ఉమ్మడి బృందాల్లో జలవనరుల, రెవెన్యూ, పోలీస్, ఎస్పీడీసీఎల్, వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు బృందాల్లో ఉంటారు. అక్రమ విద్యుత్తు కనెక్షన్లు తొలగింపు సహా, నీరు చెరువులకు చేరేలా పర్యవేక్షిస్తారు. హంద్రీ-నీవా జలాలను సమర్థంగా వినియోగించుకుని తాగునీటి ముప్పు తప్పించేందుకు కలెక్టర్ నిశాంత్‌కుమార్ మదనపల్లెలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ నెల 12 నాటికి నీరు జిల్లాలోకి ప్రవేశించనున్నాయని కలెక్టర్ తెలిపారు.

ఇష్టానుసారం చేస్తే ఇంటికే

▸ 'స్వచ్ఛ అన్నమయ్య'కు సమష్టి కృషి
▸ స్వర్ణ పంచాయతీ పోర్టల్‌తో అక్రమాలకు చెక్
▸ 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో డీపీవో రాధమ్మ

పంచాయతీల్లో నిధులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్ ప్రవేశపెట్టింది.. దీంతో గ్రామాల్లో ఏ పనులకు బిల్లులు పెట్టాలన్నా దీని ద్వారానే పెట్టాలి.. తద్వారా అక్రమాలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టామని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ తెలిపారు.. అధికారులు, ప్రజాప్రతినిధులు.. ప్రజల సహకారం.. కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రత్యేక చొరవతో జిల్లాలో స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు.. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో అక్రమాల నిరోధానికి తీసుకున్న చర్యలు, స్వర్ణ పంచాయతీ పోర్టల్.. స్వచ్ఛ అన్నమయ్య జిల్లా సాధన తదితర అంశాలపై 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆమె మాట్లాడారు. - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

పన్ను బకాయిల వసూలుకు చర్యలు..

జిల్లాలో 25 మండలాల్లో 411 పంచాయతీలు, 4,304 వార్డులు ఉన్నాయి. జిల్లాలో 2,87,400 ఇళ్లు, దుకాణాలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1.99 కోట్లతో కలిపి ఆస్తి పన్ను రూ.15.91 కోట్లు డిమాండ్ ఉంది. ప్రస్తుతం రూ.1.50 కోట్లు వసూలు చేశాం. 90.52 శాతం వసూలు చేయాల్సి ఉంది. కేటాయించిన లక్ష్యాన్ని గడువులోగా పూర్తిచేయాలని కార్యదర్శులను ఆదేశించాం.

అందరికీ జవాబుదారీగా..

జిల్లాలో పలు పంచాయతీ కార్యదర్శులు బిల్లులు ఇష్టానుసారంగా డ్రా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల బిల్లులు స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లోనే పెట్టాలి. లేకుంటే బిల్లులు మంజూరు కావు. జిల్లాలో డీజిల్ ఖర్చుల కింద చూపిన రూ.50,20,150కు సంబంధించి 13 మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ పీఆర్ కమిషనర్‌కు నివేదించాం. నిధులు దుర్వినియోగం కాకుండా స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేసేలా కేటగిరీ వైజ్ ఉంది. నిబంధనలు పాటించకుంటే ఇంటికి వెళ్లాల్సి వస్తుంది. పంచాయతీలో చేపట్టే ప్రతి పని, ఖర్చు వివరాలు పన్ను చెల్లిస్తున్న ప్రతి ఒక్కరి మొబైల్‌కు సమాచారం వెళ్తుంది. తద్వారా పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలనేది ప్రభుత్వ ఆలోచన. వీధి దీపాలపై ఈఈఎస్ఎల్ సర్వే చేపట్టి మరమ్మతులకు సాధారణ నిధులు ఇచ్చాం.

రూ.2 లక్షలు పైబడితే టెండర్ పిలవాలి..

అభివృద్ధి పనులకు పంచాయతీల్లో నిధుల కొరత ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధులు చివరి విడత రావాలి. మూడేళ్లుగా స్టాంప్ డ్యూటీ జమకాలేదు. గ్రామాల్లో రూ.2 లక్షలు పైబడిన పనులకు టెండర్లు పిలవాలి. గ్రామాల్లో కాలువల నిర్మాణాలకు 15వ ఆర్థికసంఘ నిధులు మంజూరైతే పనులు చేపట్టాలి.

అక్రమ లేఅవుట్లపై చర్యలు..

నిబంధనల మేర లేఅవుట్లు వేయకుంటే చర్యలు తప్పవు. వ్యవసాయ భూమిని కమర్షియల్ కింద మార్చాక అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అనుమతి ఉండాలి. అలాకాక ఇళ్లు నిర్మిస్తే నోటీసులిస్తాం. ప్లాన్ అప్రూవల్ ఇవ్వాలంటే 300చ.మీ లోపు జీప్లస్-2 నిర్మాణానికి పంచాయతీ, సెల్లార్, జీప్లస్-3 నుంచి ఉడా అనుమతి తీసుకోవాలి.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక దృష్టి..

పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకుంటే చర్యలు తీసుకుంటాం. పంచాయతీ, గ్రామ సరిహద్దుల్లో చెత్త, వ్యర్థాలు తొలగించాలని కార్యదర్శులను ఆదేశించాం. ప్రతి రోజు ఇంటింటా చెత్త సేకరించాలని స్పష్టంగా చెప్పాం. జిల్లాలో ప్రతి వెయ్యి మందికి ఒక గ్రీన్ అంబాసిడర్ చొప్పున 1,101 మంది ఉన్నారు. 331 ట్రై సైకిళ్లు ఇచ్చాం. 38 ఆటోలు ఉన్నాయి. 56 ట్రాక్టర్లు, 112 పుష్‌కార్టులు సైతం ఉన్నాయి. ప్రతి పంచాయతీలో ఫాగింగ్ యంత్రాలను అందుబాటులో ఉంచాం. కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రత్యేక చొరవ, ఆదేశాలతో అందరి సమష్టి సహకారంతో స్వచ్ఛ అన్నమయ్య జిల్లాగా తీర్చిదిద్దుతాం.

శ్రీవారి దర్శనానికి 10 గంటల సమయం

తిరుమల: శ్రీవారి సర్వదర్శనానికి భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1, నారాయణగిరి షెడ్లలో వేచిఉన్నారు. వీరికి 10 గంటల్లో, రూ.300 టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభిస్తోంది. శ్రీవారిని ఆదివారం 81,687 మంది భక్తులు దర్శించుకోగా హుండీ కానుకలు రూ.4.36 కోట్లు లభించాయి.

మండేస్తోంది..

▸ ఎల్‌నినోతో భానుడి భగభగ ▸ తగ్గని ఉష్ణోగ్రతలు

అన్నమయ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా..

ఆగస్టు (తేదీలు)	ఉష్ణోగ్రత
25	33.5
26	34
27	36
28	36
29	37.2
30	35
31	34

రాయచోటి ప్రాంతంలో మాడిపోయిన మామిడి చెట్లు

పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్‌నినో పరిస్థితులతో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తు తున్నారు.. పశువులు అల్లాడిపోతున్నాయి.. ప్రస్తుతం మండు వేసవిని మించి తలపిస్తోంది.. ఓవైపు ఉక్కపోత, వేడిగాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఏడు గంటలకే భానుడు ఉగ్రరూపం చూపుతూ అంతకంతకూ నిప్పులు చెరుగుతున్నాడు.. ఈ నేపథ్యంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలో గత వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు.. - న్యూస్‌టుడే, పుత్తూరు, రాయచోటి

మరింత తీవ్రం..

ఎల్‌నినో ప్రభావంతో ప్రస్తుతం 35 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు నమోదవుతోంది. గత మూడు నెలలుగా ఆశించిన వర్షాలు లేకపోవడం, లోటు వర్షపాతంతో భూ వాతావరణం చల్లబడలేదు. దీంతో ప్రస్తుత ఎండల తీవ్రతకు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 10 గంటలు దాటితే బయట తిరగలేని పరిస్థితి. సెప్టెంబరులో సూపర్ ఎల్‌నినో ఉంటుందని వాతావరణ అధికారులు చెబుతున్న నేపథ్యంలో ఎండలు మరింత పెరగనున్నాయి. తాగునీటి సమస్య తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాల్సిన అవసరం ఉంది.

తితిదే డిగ్రీ కళాశాలలకు నూతన ప్రిన్సిపాళ్లు

తిరుపతి(తితిదే, మహిళా వర్సిటీ): తితిదే డిగ్రీ కళాశాలలకు నూతన ప్రిన్సిపాళ్లను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఎస్పీడబ్ల్యూ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భువనేశ్వరికి డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా నియమించారు. ఇక్కడున్న నారాయణమ్మను ఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపల్‌గా నియమించారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా చరిత్ర అధ్యాపకుడు జి.కిషన్‌ను నియమించారు. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణపై.. అక్కడి అధ్యాపకురాలు లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడంతో ఆయన్ను ఎస్వీ ఆర్ట్స్ కళాశాల లెక్చరర్‌గా బదిలీ చేశారు.

ఏకదంతాయ.. వక్రతుండాయ

శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారు ఉభయ దేవేరులైన సిద్ధిబుద్ధి సమేతుడై స్వర్ణరథం అధిరోహించి ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ సోమవారం రాత్రి భక్తులను కటాక్షించారు. ఉత్సవ మూర్తులకు ఆస్థాన మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, గణేశ నామస్మరణల నడుమ ఊరేగించారు. ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి, భక్తులు పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, కాణిపాకం

వీబీ జీ రామ్‌జీ @9

ఈ ఏడాది జులైలో ప్రారంభమైన వీబీ జీ రామ్ జీలో రాష్ట్రం 52.2 శాతం శ్రామికులకు అత్యధికంగా పనిదినాలు కల్పించి అగ్రస్థానంలో నిలవగా.. అన్నమయ్య జిల్లా తొమ్మిదో స్థానంలో నిలిచింది. దీని కింద 6,954 పనులు చేపట్టారు. ఇప్పటివరకు రూ.25.02 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం జిల్లాలో రోజుకు 23 వేల మంది శ్రామికులు పనిచేస్తున్నారు. జులైలో 42,914 మంది శ్రామికులు 4,03,387 పనిదినాలు పూర్తిచేశారు. ఇందుకు రూ.11.14 కోట్లు చెల్లించారు. ఆగస్టులో 25 వేల మంది 4,76,507 పనిదినాలు పనులు చేయగా శ్రామికులకు రూ.13.87 కోట్లు చెల్లించారు. జిల్లాలో రామాపురం మండలం 80,577 పనిదినాలతో మొదటి స్థానంలో ఉండగా 7,514 మంది శ్రామికులతో కంభంవారిపల్లి చివరి స్థానంలో ఉంది. దీన్ని అధిగమించేందుకు అధికారులు పనులు వేగవంతం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

మదనపల్లె మండలంలోని పొన్నూటిపాళ్యంలో వంక పనుల్లో శ్రామికులు

వలసల నివారణకు చర్యలు..

ఎల్‌నినో కారణంగా వర్షాభావ పరిస్థితులతో జులై, ఆగస్టులో సాగు పనులు తగ్గాయి. శ్రామికులకు వీబీ జీ రామ్ జీలో పనిదినాలు కల్పిస్తున్నాం. నీటి ప్రవాహ వేగాన్ని తగ్గించేందుకు వంకల్లో నీటి కుంటలు, పశువుల నీటితొట్టెలు, పంట కుంటలు, రింగ్ ట్రెంచ్‌లు, మ్యాజిక్ డ్రైన్‌ల నిర్మాణం 29 కిమీ మేర చేపట్టాం. జిల్లాలో రోజుకు 46 వేల మంది లక్ష్యానికి.. ప్రస్తుతం 25 వేల మంది పనిచేస్తున్నారు. దీన్ని అధిగమించేందుకు రైతులు, కూలీలకు అవగాహన కల్పిస్తూ పనులు కల్పిస్తున్నాం. వలసల నివారణకు చర్యలు చేపట్టాం.

-వెంకటరత్నం, పీడీ, డ్వామా

(c) eenadu

పూల రైతులకు సిరులు

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో పూల తోటలతో రైతులు లాభాలు గడిస్తున్నారు. పుంగనూరు నియోజకర్గంలో కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు. బంతి, చామంతి, కనకాంబరం, లిల్లీ, రోజా, మల్లెల సాగువైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. చామంతి, బంతి పూలను ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసినా కనకాంబరం, లిల్లీ పూల తోటలు తక్కువ విస్తీర్ణంలోనే సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పండుగల రోజులు కావడంతో పూల ధరలకు రెక్కలొచ్చాయి. గత నెలతో పోల్చుకుంటే ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.

పెరిగిన ధరలు: వర్షాలు కురవక పోవడంతో పొరుగు రాష్ట్రాల్లో చామంతి, బంతిపూల తోటలు దెబ్బతిన్నాయి. దీనికి తోడు పండగ రోజుల్లో ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు ఊహించిన విధంగానే ఈ ఏడాది ధరలు ఉన్నాయి. వినియోగానికి తగ్గట్టు దిగుబడులు ఉండకపోవడంతో ధరలు అనూహ్యంగా పెరిగాయి.

తోటల దగ్గరకే వ్యాపారులు: పూల ధరలు పెరుగుతున్నందున వ్యాపారులు తోటల దగ్గరకే వెళ్లి తోటపైనే కొనుగోలు చేస్తున్నారు. రైతులు సైతం లాభం కళ్లకు కనబడుతుండడంతో విక్రయిస్తున్నారు. మరికొందరు రైతులు కూలీలు, ఇంటి మనుషులను ఉపయోగించుకుని కోసి మార్కెట్‌కు తరలిస్తుండడంతో మరింత ఆదాయాన్ని పొందుతున్నారు.

600హెక్టార్ల లక్ష్యం: ఈ ఏడాది జిల్లాలో 600 హెక్టార్లలో పూల తోటల సాగు లక్ష్యం కాగా 530 ఎకరాల్లో సాగయ్యాయి. మల్చింగ్‌కు, సాగు ఖర్చులు పెరగడం, వర్షాలు లేక పోగా అన్ని వర్గాల వారికి రాయితీ వర్తించక పోవడంతో రైతులు మొగ్గు చూపడం లేదు. దీంతో బంతి, చామంతి, సన్నమల్లెలు, రోజా, లిల్లీ, మల్లెలు, కనకాంబరం సాగు చేశారు.

జిల్లాలో పూలతోటల సాగు.. దిగుబడులు, ధరల వివరాలు..

పూల రకం	సాగు (ఎకరాల్లో)	దిగుబడులు (టన్నుల్లో)	ధర (కిలో)
బంతి	195	2700	55
రోజాపూలు	46	220	300
కనకాంబరాలు	9	10	1500
చామంతి	241	2650	200
లిల్లీ	102	510	300

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రశ్న: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కొత్త రైతు యాప్ పేరేమిటి? దాని ఉపయోగాలు తెలపండి? - **సుధాకర్‌నాయుడు, రైతు, డీపీకండ్రిగ,రేణిగుంట మండలం**

జవాబు: ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది. ఇందులో పొలం విస్తీర్ణం, సర్వే నెంబరు సమాచారం, వర్షం, వాతావరణ అప్‌డేట్లు, నేల ఫర్టిలిటీ నివేదిక, ముందస్తు చీడపీడలు, పంట సాగు, రాయితీ పథకాల వివరాలు, మార్కెట్ ధరల సూచనలు వ్యవసాయ శాఖ వారు రైతులకు నేరుగా తెలియ చేస్తారు.

- సునీల్‌కుమార్, ఏవో

సమీకృతం.. జీవాలకు శ్రేయస్కరం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వర్షా కాలం నేపథ్యంలో జీవాల పెంపకందారులు గొర్రెలు, మేకలకు సమీకృత ఆహారాన్ని అందుబాటులో ఉంచడం ఎంతో శ్రేయస్కరం. వర్షాల సమయంలో మేతకు వెళ్లేందుకు వీలుండని పరిస్థితి. అలాంటి సమయాల్లో పోషకాల సమీకృత ఆహారాన్ని దాణాగా వేయడంవల్ల పోషక శక్తిని పెంచుకోగలవు. దీన్ని పెంపకం దారులు స్వయంగా తయారు చేసుకోవచ్చు. మొక్కజొన్న, గోధుమ తవుడు, మినప, కంది, పెసర పొట్టు, వేరుసెనగ చెక్క, లవణ మిశ్రమం తగిన మోతాదులో సిద్ధం చేసుకుని తద్వారా పోషకాలు కల్గిన ఆహారాన్ని సిద్ధం చేసుకోవచ్చు. వీటి వాడకం ద్వారా కలిగే ప్రయోజనాలు అపారమనే చెప్పాలి.

❖ జీవాలకు నిర్దేశిత మోతాదు ప్రకారం సమీకృత ఆహార పదార్థాలు సరైన పాళ్లల్లో అందుతాయి. ❖ మేత వృథా అయ్యే అవకాశం ఉండదు. ❖ తేలిగ్గా జీర్ణం చేసుకునే వీలుండటంతో అజీర్ణ సమస్యలు తలెత్తవు. ❖ దాణా ఖర్చు 15 నుంచి 20 శాతం మేర తగ్గే అవకాశం ఉంటుంది ❖ జీవాల్లో ఆశించిన విధంగా ఎదుగుదల ఉంటుంది. ❖ అనారోగ్య సమస్యలను తట్టుకునే శక్తి పెంపొందుతుంది ❖ ఎలాంటి రసాయనాలు కలిసే అవకాశం లేక పోవడంతో జీవాలు మరింత ఎదుగుదలతో వృద్ధి చెందగలవు.

- డాక్టర్ గోవిందభాస్కర్, సహాయ సంచాలకులు, పశు సంవర్ధక శాఖ, శ్రీకాళహస్తి

కాలి బాటలు.. అధిక దిగుబడులు

రైతేరాజు

పుత్తూరు, న్యూస్‌టుడే: రైతులు వరి సాగులో మెలకువలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని పుత్తూరు వ్యవసాయాధికారి కోదండయ్య తెలిపారు. అదనపు ఖర్చు అని భావించకుండా పంటలో కాలిబాటలు ఏర్పాటు చేసుకుంటే లాభాలు పొందవచ్చు. ఖరీఫ్ సాగులో కాలిబాటలు వేయడానికి ఎకరానికి సుమారు రూ.300 నుంచి రూ.500 వరకు వ్యయమవుతుందన్నారు. వీటి పక్కనున్న దుబ్బులు మూడు, నాలుగు పిలకలు అధికంగా వేయడంతో పాటు ఎకరానికి మూడు నుంచి నాలుగు బస్తాల వరకు దిగుబడి పెరుగుతుందన్నారు.

❖ ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు వెడల్పున గట్ల పక్క నుంచి ఒక అడుగు ఖాళీ ఉండేలా వరి నాట్లు వేసి కాలిబాటలు వేయాలి. మొదళ్లకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడలు త్వరగా ఆశించకుండా ఉంటాయి. బాటలకు ఇరువైపులా ఉన్న వరి కుదుర్లను అధికంగా దుబ్బులు కడతాయి. నిత్యం రైతులు బాటల వెంబడి నడుస్తూ పంటలో తెగుళ్ల గుర్తించడానికి, కలుపు మొక్కలు ఏరివేయడానికి వీలవుతుంది. ఎరువులు సక్రమంగా చల్లుకోవచ్చు. పంటలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటే అవసరముంటే ముందుగా తెగులు సోకిన చోట మందులు పిచికారీ చేసి తర్వాత మిగిలిన చోట చేయొచ్చు. బాటల వెంబడి ఎలుకల నివారణకు చర్యలు చేపట్టడానికి వీలుంటుంది.

మా డబ్బు మాకు ఇప్పించండి సార్..

● సోషల్ మీడియాలో ప్రకటన చూసి మోసపోయాం ● పోలీసు గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదు

న్యూస్‌టుడే, మదనపల్లె నేరవార్తలు

స్క్రబ్‌ఎక్స్ పేరుతో రమేష్ అనే వ్యక్తి, మరికొందరు మోసం చేసి డబ్బు తీసుకుని బోర్డు తిప్పేశారు.. ఈ కేసులో నిందితుడు తిరుమలకొండ రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు.. అతడి నుంచి తమకు రావాల్సిన డబ్బు ఇప్పించాలని మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం, శ్రీ సత్యసాయిజిల్లా, అనంతపురం, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు చెందిన స్క్రబ్‌ఎక్స్ బాధితులు విన్నవించారు.. పీజీఆర్‌ఎస్‌లో సోమవారం ఎస్పీ ధీరజ్‌కు వారు ఫిర్యాదు చేశారు.. తాము సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటన చూసి మోసపోయి డబ్బు కట్టామని నిందితుడితో పాటు సంబంధిత పోస్టు పెట్టిన సోషల్ మీడియా నిర్వాహకులపైనా చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన స్క్రబ్‌ఎక్స్ బాధితులు

ఆక్రమించారని ప్రశ్నిస్తే దాడి చేస్తున్నారు..

సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామానికి చెందిన తన భూమిలో అదే గ్రామానికి చెందిన జాహిదా ఆమె కుటుంబ సభ్యులు అక్రమంగా బోరు వేశారని నాగూరు చిన్నరెడ్డి సాబ్, అతడి భార్య బావమ్మ ఫిర్యాదు చేశారు. అదేమిటని ప్రశ్నిస్తే తమపై దాడులు చేస్తున్నారని వారు కన్నీటిపర్యంతమయ్యారు.

డబ్బు అడిగితే ముఖం చాటేశాడు..

మదనపల్లెకు చెందిన మగ్దుంబాషా ఇటుకల బట్టీ పరికరాలు రూ.9.50 లక్షలకు తీసుకుని తర్వాత డబ్బు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని బాధితుడు అక్బర్ ఆలీ కన్నీటిపర్యంతమయ్యారు. డబ్బు ఇవ్వాలని ప్రశ్నిస్తే ఇంటి స్థలం ఇచ్చాడన్నారు. ఆ స్థలంలోకి వెళ్తే అప్పటికే వేరే వ్యక్తులు ఆక్రమించుకుని ఉన్నారన్నారు. తన డబ్బు తనకు ఇవ్వాలని కోరితే ముఖం చాటేస్తున్నాడని ఆరోపించారు.

భర్త ఇబ్బంది పెడుతున్నాడు..

తనకు నాలుగు సంవత్సరాల క్రితం వివాహమై కుమార్తె పుట్టిందని తర్వాత తన భర్త తనను వదిలేసి వెళ్లి పోయాడని పెద్దమండ్యం మండలం దిగువపల్లెకు చెందిన పల్లవి ఫిర్యాదు చేశారు. తన భర్త మదనపల్లెలోని ఓ బ్యాంకులో ఫీల్డ్ స్టాఫ్‌గా పనిచేస్తున్నాడన్నారు. మూడున్నరేళ్లుగా నా భర్త.. నా వద్దకు రాకుండా, కుటుంబాన్ని పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు. తనకు న్యాయం చేయాలని విన్నవించారు.

డీపీవో వెలుపల పల్లవి, ఆమె తల్లి సరస్వతమ్మ

ప్రతి సమస్య పరిష్కరిస్తాం

● పీజీఆర్‌ఎస్‌కు 316 వినతులు

కలెక్టరేట్(మదనపల్లె గ్రామీణ), న్యూస్‌టుడే: పీజీఆర్‌ఎస్‌లో వచ్చే ప్రతి సమస్యను పూర్తి స్థాయిలో విచారించి పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా సోమవారం జిల్లాలోని వివిధ మండలాల నుంచి 316 మంది తమ సమస్యలపై వినతులు అందజేశారు. పట్టాదారు పాసుపుస్తకాలు, 1బీ, అడంగల్, డీకేటీ భూముల, సొంత స్థలాల ఆక్రమణలు, సర్వే సమస్యలను బాధితులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిని క్షేత్రస్థాయిలో విచారించి దస్త్రాలు పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డీఆర్వో వెంకటేశు, ఎస్‌డీసీ చంద్రశేఖర్, జిల్లా భూ, రికార్డుల సర్వే అధికారి శాంతారాజ్ పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, జేసీ శివనారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

బాధితులకు న్యాయం చేయండి

పిటిషనర్లను విచారిస్తున్న జేసీ శివనారాయణశర్మ

కలెక్టరేట్(మదనపల్లె గ్రామీణ), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కార్యాలయ సూపర్ ఆడిట్ పిటిషన్లు సత్వరమే పరిష్కరించాలని జేసీ శివనారాయణశర్మ.. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కోర్టు హాల్‌లో సీఎం కార్యాలయ సూపర్ ఆడిట్ టీం ద్వారా వచ్చిన పిటిషన్లను జేసీ సోమవారం పరిశీలించి బాధితులతో మాట్లాడారు. మండల, గ్రామ స్థాయిలో లోపాలు గుర్తించి దస్త్రాలను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం తీసుకున్న నిర్ణయాలపై బాధితులకు క్లుప్తంగా వివరించాలన్నారు. కేఆర్‌ఆర్‌సీ, పీజీఆర్‌ఎస్ జిల్లా నోడల్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, పీజీఆర్‌ఎస్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి: ఎస్పీ

● గ్రీవెన్స్‌లో 71 ఫిర్యాదులు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో 71 ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ ధీరజ్ తెలిపారు. భూ సంబంధిత ఫిర్యాదులు 30, ఆర్థిక వివాదాలు 10, గొడవలకు సంబంధించి 10, మోసం, సైబర్ నేరాలకు సంబంధించి 7, కుటుంబ వివాదాలు 6, పరిపాలన సంబంధిత ఫిర్యాదులు 3, ఇతర ఫిర్యాదులు 5 వచ్చాయని చెప్పారు. బాధితుల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించిన ఎస్పీ వారి సమస్యలను సావధానంగా విని సంబంధిత స్టేషన్ల అధికారులకు సమాచారం ఇచ్చారు. పీజీఆర్‌ఎస్ ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని ఆయా స్టేషన్ల సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ కార్యాలయానికి నేరుగా రాలేని వారు సంబంధిత మండలాల్లోని స్టేషన్లలో ఫిర్యాదు చేయవచ్చని స్పష్టం చేశారు.

బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్

పరిశ్రమల స్థాపనకు త్వరగా అనుమతులు: కలెక్టర్

కలెక్టరేట్(మదనపల్లె గ్రామీణ), న్యూస్‌టుడే: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. భారత్ సమావేశ మందిరంలో పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీతో ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలన్నారు. పీఎంఈజీపీ కింద 74 యూనిట్లకు రూ.2.26 కోట్ల మార్జిన్‌మనీ మంజూరు కానుందన్నారు. మరో 27 యూనిట్లకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేశామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా పూర్తిచేయాలని ఏపీఐఐసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గత 89 రోజుల్లో వివిధ పరిశ్రమల స్థాపనకు వచ్చిన 36 దరఖాస్తుల్లో 26కు అనుమతులు ఇచ్చామని, 12 పరిశీలనలో ఉన్నాయని అధికారులు.. కలెక్టర్‌కు వివరించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించి జిల్లాలోని నాలుగు ఉత్పాదక రంగానికి చెందిన పరిశ్రమలకు రూ.30.78 లక్షల రాయితీ మంజూరుకు కమిటీ ఆమోదించింది. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కృష్ణకిషోర్, ఏపీఐఐసీ అధికారి ప్రవీణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పరిశ్రమల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

హైవేకి ఆనుకొని చంద్రగిరి దగ్గర మరియు IIT దగ్గర ఎర్రచందనం చెట్లతో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు కలవు డైరెక్ట్ ఓనర్, ఫోన్: 95027 74175,79959 92114.

JOBS

ఉద్యోగ అవకాశాలు కనీస అర్హత 10th ఆపై. Age:25-65Y జీ: 3,000-30,000+ ఇన్సెంటివ్స్, ఇన్సూరెన్స్, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. 95058 50438.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

THE EENADU WAY CLASSIFIEDS

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-

Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే

తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు...

80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600

Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

సమస్యల సాధనకు దశలవారీ ఉద్యమం

కలెక్టరేట్(మదనపల్లె గ్రామీణ), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు ఉద్యోగ సంఘాలు కలెక్టరేట్‌ను ఆశ్రయించాయి. సామాజిక సమస్యలపై పలు సంఘాలు నిరసనలు, ర్యాలీలు నిర్వహించారు.

ఉద్యమ కార్యాచరణ..

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సమస్యల సాధనకు కార్యాచరణ ప్రణాళికతో ఉద్యమిస్తామని ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ నరసింహకుమార్ పేర్కొన్నారు. ఉద్యమానికి సంబంధించి ఆందోళన కార్యక్రమాల నోటీసును కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ నియమించి అమలు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, డీఏ బకాయిలు విడుదల చేయాలని, విశ్రాంత ఉద్యోగులకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పింఛను పునరుద్ధరించాలని, పీఆర్సీ, జీపీఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు ప్రతిఒక్క ఉద్యోగి పే స్లిప్‌లో పొందుపరచాలన్నారు. ఈహెచ్‌ఎస్ వినియోగంలోకి తీసుకురావాలని, గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలనే తదితర 29 డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. తమ సమస్యల సాధనకు సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 26 వరకు వివిధ దశల్లో నిరసన చేపడతామని చెప్పారు. ఏపీ ఐకాస మహిళా విభాగ ఛైర్‌పర్సన్ భార్గవి, సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసులు, రెవెన్యూ అసోసియేషన్ మదనపల్లె డివిజన్ అధ్యక్షులు విద్యాసాగర్, జిల్లా గౌరవాధ్యక్షులు ఫణికుమార్, అస్లాం బాషా, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వెలుపల ఏపీ ఐకాస అమరావతి ఉద్యోగుల సంఘం నాయకులు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి..

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏపీ రజక ఎస్సీ సాధన కమిటీ రాష్ట్ర నాయకులు రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ విషయమై 1985లో నాటి సీఎం ఎన్టీఆర్ కేబినెట్‌లో ఆమోదించి కేంద్రానికి పంపారని గుర్తుచేశారు. 2014లో దీన్ని తెదేపా ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారన్నారు. 2024లో ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్‌లో సీఎం చంద్రబాబు ప్రకటించారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం పట్టణ అధ్యక్షులు నాగరాజు, నాయకులు లక్ష్మీదేవమ్మ, రెడ్డెప్ప, గురుమూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కరవు జిల్లాగా ప్రకటించాలి

కరవు జిల్లాగా ప్రకటించాలని వైకాపా రైతు విభాగ నియోజకవర్గ అధ్యక్షులు రాజేంద్రనాయుడు డిమాండ్ చేశారు. రైతు విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎల్‌నినోతో మదనపల్లె నియోజకవర్గంలో సాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయని, టమాట ధరలు పతనమై రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారన్నారు. పంట నష్టం కింద ఎకరానికి రూ.10 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. విజయ్‌భాస్కర్, నాగరాజురెడ్డి, నాగరాజ, రెడ్డెప్ప, వెంకటచలపతి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

స్కిల్ లేదు.. అభివృద్ధి కాదు

ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థను కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎక్కడికక్కడ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు శిక్షణ ఇప్పించి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో వీటిని నిర్వహిస్తోంది. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో యువతకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పీలేరు సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ కేంద్రం గత నవంబరు నుంచి మూతపడి ఉంది. ఫలితంగా ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువత ధ్రువపత్రాలు చేబూని కర్ణాటక, హైదరాబాద్, చెన్నై నగరాలకు వలస వెళ్తున్నారు.

-న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ

మూతపడిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యాలయం

నగిరిపల్లెలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పుంగనూరు నూతన ఇన్‌ఛార్జి మధుసూదన్‌నాయుడు

చంద్రబాబు రాజకీయ మహాశక్తి

కలికిరి, న్యూస్‌టుడే: తెదేపా పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ప్రతిఒక్కరూ పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. పుంగనూరు నియోజకవర్గ నూతన ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన మధుసూదన్‌నాయుడు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు సోమవారం నగిరిపల్లెలోని తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సూచనల మేరకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. పుంగనూరు నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలకు తావులేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మధుసూదన్‌నాయుడు మాట్లాడుతూ అందరితో కలిసి పనిచేస్తానని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో పుంగనూరు నియోజకవర్గంలో స్థానాలన్నీ గెలిపించి సీఎం చంద్రబాబుకు కానుకగా ఇస్తానన్నారు. పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మధుసూదన్‌నాయుడు మాజీ సీఎం, భాజపా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న మధుసూదన్ నాయుడు

రోదనల మధ్య స్నేహితుల అంత్యక్రియలు

ములకలచెరువు, న్యూస్‌టుడే: అయ్యో దేవుడా మా బిడ్డలు ఏం పాపం చేశారయ్యా.. అల్లారుముద్దుగా పెంచుకుంటే తీసుకెళ్లిపోయావు దేవుడా అంటూ రోదనల మధ్య మలిగివారిపల్లిలో విషాధఛాయలు అలుముకున్నాయి. ఆదివారం ములకలచెరువు మండలం, పెద్దపాళ్యం సమీపంలోని బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను మలిగివారిపల్లికి తరలించారు. స్వగ్రామానికి రాగానే గ్రామస్థులను కంటతడి పెట్టించాయి.

ఇండియన్ కాంగ్రెస్ చేనేత విభాగం నూతన కమిటీ ఎన్నిక

రమేశ్ నాయుడు

ఎస్.వెంకటరమణ

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: ఇండియన్ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేశ్‌నాయుడు, ఉపాధ్యక్షులుగా ఎస్.వెంకటరమణ, ఎస్.రాజబాబు, కార్యవర్గ సభ్యులుగా ఎస్.బావాజాన్, బి.రాజు, రమేశ్, శంకర్, బి.బయ్యారెడ్డి, శ్రీనివాసులు, పి.శ్రావణ్, ఎం.ద్వారకనాథ్, రవికుమార్‌ను ఎన్నుకున్నారు.

70 గ్రామాల్లో నిరంతర త్రీఫేజ్ వెలుగులు

చిత్తూరు(మిట్టూరు): ఆర్డీఎస్‌ఎస్ నిధులతో ప్రతి గ్రామంలో త్రీఫేజ్ పనులు చేస్తున్నట్లు విద్యుత్తుశాఖ కన్‌స్ట్రక్షన్ విభాగం ఈఈ భాస్కర్‌నాయుడు పేర్కొన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా చౌడేపల్లె మండలం లద్దిగం ఉప కేంద్రంలో ఏర్పాటు చేసిన లైన్లు, నియంత్రికలకు సరఫరా ప్రారంభించినట్లు చెప్పారు. ● **40 మందికి ఉద్యోగోన్నతులు..:** ఎస్పీడీసీఎల్‌లో 40 మందికి ఉద్యోగోన్నతులు కల్పిస్తూ సీఎండీ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో 28 మందికి, అకౌంట్స్ విభాగంలో 12 మందికి ఉద్యోగోన్నతులు వచ్చాయి. ఎస్‌ఈలుగా ఉన్న శ్రీనివాసబాబు, సుధాకర్‌కుమార్‌కు సీజీఎంలుగా, ఈఈలు శ్రీధర్, భూపతి, శ్రీనివాసులురెడ్డి, జయకృష్ణారెడ్డి, సుధాకర్, శేషాద్రి, విజయరాజు, సురేష్‌బాబుకు ఎస్‌ఈలుగా అవకాశం కల్పించారు. కొందరు డీఈఈలు ఈఈలుగా, ఏఈలకు డీఈఈలుగా ఉద్యోగోన్నతి వచ్చింది.

వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

రాయచోటి, న్యూస్‌టుడే: మండలంలోని దిగువ అబ్బవరంలో వరకట్న వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిందని డీఎస్పీ కృష్ణమోహన్ సోమవారం తెలిపారు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలానికి చెందిన లావణ్య(25)తో ఆరేళ్ల క్రితం అబ్బవరానికి చెందిన ప్రసాద్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. ప్రసాద్, ఆయన అవ్వ, తాత.. లావణ్యను తరచూ అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తుండటంతో తాళలేక 15 రోజుల క్రితం లావణ్య ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. తీవ్రంగా గాయపడిన ఆమె తిరుపతిలోని స్విమ్స్, ఇతర ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు భర్త ప్రసాద్, అవ్వ, తాతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ పేర్కొన్నారు.

యువకుడి మృతి.. మరొకరి పరిస్థితి విషమం

చంద్రగిరి: అన్నమయ్య జిల్లా సదుం మండలంలోని చీకలచేను గ్రామానికి చెందిన పచ్చిపాల చరణ్‌కుమార్, చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని అయ్యప్పగారిపల్లికి చెందిన తోట కిరణ్‌కుమార్ స్నేహితులు. ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తున్న వీరిని ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రగాయాలైన వీరిని రుయాకు తరలించారు. చరణ్‌కుమార్ (20) మృతిచెందగా తీవ్రగాయాలకు గురైన కిరణ్‌కుమార్‌ను రేణిగుంటలోని అమర ఆసుపత్రికి తీసుకెళ్లారు. యువకుడి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల కళ్లుగప్పి పారిపోయేందుకు యత్నించిన రౌడీమూకలు

☛ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలో అర్ధరాత్రి ఘర్షణ పడుతున్న వారిని వారించి స్టేషన్‌కు తరలించేందుకు వెళ్లిన పోలీసులకు అల్లరిమూకలు ముచ్చెమటలు పట్టించారు. వారి కళ్లుగప్పి పారిపోయేందుకు యత్నించిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పట్టణంలోని రవిహాల్ సమీప ఓ ఫంక్షన్ హాల్ వద్ద ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. స్థానికులు 112కు సమచారం ఇవ్వగా రాత్రి గస్తీలో ఉన్న వలి, మరో హోంగార్డు అక్కడకు వచ్చి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు పారిపోయారు. పట్టుకున్న ఇద్దరిని స్టేషన్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో ద్విచక్ర వాహనం నుంచి దూకి పారిపోయేందుకు యత్నించారు. వారిని పట్టుకునే యత్నంలో కానిస్టేబుల్ వలి తీవ్రంగా, హోంగార్డు స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే వారు స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో మరో బృందం అక్కడకు వచ్చి వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. పోలీసుల నుంచి తప్పించుకున్న వారిని అదుపులోకి తీసుకున్నామని, తమ విధులకు ఆటంకం కలిగించే రౌడీలు, అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చలపతి హెచ్చరించారు.

చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ వలి

పరాకాష్టకు అల్లరిమూకల చేష్టలు..

రాయచోటిలో అల్లరి మూకల చేష్టలు పరకాష్టకు చేరాయి. రాత్రివేళ ఇష్టానుసారంగా పట్టణంలో మారణాయుధాలు చేబూని సంచరిస్తూ అల్లర్లకు పాల్పడుతున్నారు. వీధులు, ప్రధాన రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. పహారా కాస్తున్న పోలీసులను సైతం భయభ్రాంతులకు గురిచేస్తూ ఏకంగా వారినుంచి తప్పించుకునేందుకు యత్నిస్తున్నారు. రౌడీల ఆగడాలు చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రౌడీలు, అల్లరిమూకలు వర్గాలుగా ఏర్పడి తరచూ ఏదోఒక ప్రాంతంలో ఘర్షణలకు పాల్పడుతున్నారు.

(c) eenadu

రాయచోటి
• రాయచోటి • పీలేరు

భక్తిశ్రద్ధలతో అక్కదేవతలకు బోనాలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల పరిధి బోడిరెడ్డిగారిపల్లె సమీప అక్కులమ్మ కొండలో వెలసిన అక్కదేవతలకు సోమవారం గ్రామస్థులు బోనాలు సమర్పించారు. ఉదయం పెళ్లికాని యువత బోనాలకు కావాల్సిన సామగ్రి తీసుకుని కొండకు వెళ్లి బోనాలు వండి దేవరదానికి పూజలు చేశారు. తమలపాకులో పసుపు, కుంకుమ పెట్టి దీపం వెలిగించి మొక్కులు చెల్లించారు. ఆలయానికి వెళ్లి అక్కదేవతలకు పూజలు చేసి వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రార్థించారు. భక్తులకు సామూహిక అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పొగ మంచు కాదు... పొగే

రాయచోటి మాసాపేట వంతెన సమీపంలో కొందరు వ్యాపారులు వైర్లు, పాత సామగ్రికి అగ్గి పెట్టి వాటిలోని లోహపు వైర్లను తీసుకుంటున్నారు. రోడ్డు సమీపంలో వైర్లకు నిప్పు పెట్టడంతో తీవ్రమైన పొగతో కూడిన పొగ వ్యాపించి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పొగ మితిమీరి వెనుక వచ్చే వాహనదారులు పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాయచోటి

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి

మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న భాజపా నాయకులు

సంబేపల్లె, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని రాయచోటి భాజపా నాయకులు కలిశారు. పార్టీ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు నాయకులు మాజీ సీఎంకు వివరించారు. రాష్ట్ర అధిష్ఠానం సూచనల మేరకు మండలాల పార్టీ అధ్యక్షులను నియమించినట్లు ఆయన దృష్టికి తెచ్చారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషిచేయాలని సూచించారు. నాయకులు సమన్వయంతో ప్రణాళిక రూపొందించుకుని దాన్ని పక్కాగా అమలు చేయాలని సూచించారు. ప్రతి స్థానం ఎంతో విలువైనదని, అన్నిచోట్లా విజయం సాధించాలన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివప్రసాద్, సీనియర్ నాయకులు పాలగిరి శ్రీనివాస కుమార్ రాజు, తెదేపా నాయకులు రామచంద్ర పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నామని ఎంపీడీవో సుధాకర్ బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆక్రమించెయ్.. అడిగేదెవరు

✦ దర్జాగా కళ్లెదుటే కబ్జా

✦ కనుమరుగైన కాలిబాటలు ✦ పట్టించుకోని పురపాలక యంత్రాంగం

రాయచోటి ప్రధాన రహదారిపై ఆక్రమణకు గురైన కాలిబాట

న్యూస్‌టుడే, రాయచోటి పట్టణం

రాయచోటి పట్టణ పరిధిలో చిన్నవీధుల నుంచి ప్రధాన రహదారుల వెంట ఉన్న మురుగు కాలువలపై ఎక్కడికక్కడ ఆక్రమణలు గురవడంతో పాదచారులకు అవస్థలు తప్పడం లేదు.. రోడ్డు పక్కనున్న ఇళ్ల యజమానులు ఇంటి ముందర ఉంటున్న కాలువలపై నిర్మాణాలు చేపట్టి దర్జాగా పార్కింగ్‌గా వినియోగించుకుంటున్నారు. ప్రధాన రహదారుల వెంట కాలిబాటలు ఆక్రమించి వ్యాపారులు వస్తువులు పెట్టడంతో పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తోంది.. రోడ్డుపై వాహనాల పార్కింగ్ ఒకవైపు, బస్సులు మరో వైపు, అడ్డదిడ్డంగా వచ్చే ఆటోలు, దూసుకొచ్చే ద్విచక్ర వాహనాలతో పాదచారులు బెంబేలెత్తిపోతున్నారు.

ఎక్కడెక్కడంటే..

మాసాపేట నుంచి చిత్తూరు రింగు రోడ్డు, కొత్తపల్లె, కె.రామాపురం, గాలివీడు రోడ్డు, కొత్తపేట, మాసాపేట, అలీమాబాద్ వీధి, పాత డీఈవో కార్యాలయం నుంచి మదనపల్లె రోడ్డు వరకు, ఎల్లమ్మ చెట్టు నుంచి మంగలి కాలనీ, బోసినగర్, పెట్రోల్‌బంకు, రాజా, బంగ్లా, శివాలయం సర్కిల్ వరకు కాలువలు ఆక్రమించి మెట్లు నిర్మించారు. కొందరు టైర్లు, కొయ్యలు, ఇనుప, ప్లాస్టిక్ సామాన్లు కాలిబాటలపైనే పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కాలువ గట్టు ఆక్రమణలకు గురి కావడంతో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు వీలు లేక పోవడంతో అలానే వదిలేస్తున్నారు. ఫలితంగా కాలువల్లో చెత్తాచెదారం, వ్యర్థాలు ఇరుక్కుపోయి మురుగు ప్రధాన రహదారులపై ప్రవహిస్తూ దోమల వ్యాప్తికి ఆవాసాలుగా మారుతున్నాయి. కాలువ గట్టు, కాలిబాటలు ఆక్రమణకు గురవుతున్నా అధికార, పాలకవర్గాలు పట్టించుకోవడం లేదు.

- ✦ పట్టణ జనాభా: 1.30 లక్షలు
- ✦ వార్డులు: 34
- ✦ డ్రైన్ పొడవు: 122 కి.మీ
- ✦ ఆక్రమణకు గురైన డ్రైన్లు: 75 కి.మీ

గుర్తించి.. తొలగించాలి

-జులిఫక్రుద్దీన్, స్థానికుడు

కాలిబాటలు, కాలువ గట్టు ఆక్రమణకు గురవడంతో ప్రమాదకర స్థితిలో రోడ్డుపై నడవాల్సి వస్తోంది. వృద్ధులు, విద్యార్థులు, మహిళలు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. చాలా ఇబ్బందిగా మారింది.

నోటీసులు జారీ చేస్తాం..

పట్టణ పరిధిలో రహదారుల వెంట కాలువ గట్టు, కాలిబాటలు(ఫుట్‌పాత్) ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేస్తాం. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించి సహకరించాలి. లేకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయి. పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగింపు చేస్తాం. -రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
రాయచోటి: 9703622242
పీలేరు: 8008574958
చిన్నమండెం: 9440170752

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: ? మాధవరం పంచాయతీలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు లేవు. అధికారులు, నాయకులు స్పందించి సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. **రమేష్, గ్రామస్థుడు**

✦ మండలంలో సీసీ రోడ్లు లేని గ్రామాలను గుర్తించి ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే నిర్మాణాలు చేపడతాం. **పరిపూర్ణ అరుంధతి, ఎంపీడీవో**

కాలువ శుభ్రం

రాయచోటి పట్టణం, న్యూస్‌టుడే: హరిత హోటల్ వెనుక వైపు వీధిలో కాలువ పూడి మురుగు ముందుకు సాగడం లేదు. కాలువలో వ్యర్థాలు, రాళ్లు చేరాయి. సమస్యపై ఈ నెల 27న ఇది కాలువే.. నమ్మాలి అంతే.. శీర్షికన చిత్ర కథనాన్ని ఈనాడు ప్రచురించింది. స్పందించిన అధికారులు కాలువను శుభ్రం చేసి రాళ్లు లేకుండా చేసి మురుగు ముందుకు కదిలేలా చర్యలు తీసుకున్నారు.

ఆలయ అధికారులకు విరాళం అందజేస్తున్న దాతలు

నిత్యాన్నదానానికి విరాళం

రాయచోటి, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ నిత్యాన్నదాన పథకానికి రామాపురం మండలం చింతలవాండ్లపల్లెకు చెందిన చింతల సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,00,116 సోమవారం విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ టి.మనోజ్ కుమార్, ఈవో వెంకటరమణారెడ్డికి వారు సదరు విరాళం నగదు చెక్కు అందజేశారు. కడపకు చెందిన రవికుమార్ రూ.7,516, తిరుపతికి చెందిన పేర్ల రవిబాబు రూ.7,516, శేఖర్‌బాబు రూ.7,516 విరాళంగా అందించారని ఛైర్మన్ మనోజ్‌కుమార్ తెలిపారు. దాతలకు స్వామి దర్శనం కల్పించి ఆపై సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వీధుల్లో ఇలా.. అడుగేసేదెలా

పట్టణంలో రద్దీగా ఉండే మార్కెట్ వీధిలోని మురుగు కాలువలు చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయి మురుగు రోడ్లపై పొంగుతోంది. క్రమం తప్పక పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. కూరగాయలు, నిత్యావసర సరకులు కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు మురుగులోనే నడవాల్సి వస్తోంది. వాహనాల రద్దీతో వీధులు బురదమయమై తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. గంపలతో కూరగాయలు తెచ్చేవారు రోడ్డుపైనే కూర్చొని వ్యాపారాలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.

-న్యూస్‌టుడే, రాయచోటి

మురుగు.. తొలగేదెన్నడో అడుగు

మద్రికుంటపల్లె పంచాయతీ కొత్తగజ్జలవారిపల్లె వీధుల్లో సీసీరోడ్లు నిర్మించి మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదు. ఫలితంగా ఇళ్లల్లోని మరుగుదొడ్లు, స్నానపు గదుల నుంచి వచ్చే వ్యర్థనీరంతా వీధుల్లో ప్రవహిస్తోంది. పారిశుద్ధ్య పనులు చేపట్టేవారు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. -న్యూస్‌టుడే, కలికిరిగ్రామీణ

ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు

రాయచోటి: ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేసిన విద్యార్థులు

పీలేరు: అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో విజయలక్ష్మి

రాయచోటి, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కారం కోసం వచ్చే ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలకు నిర్ణీత గడువు లోపు సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలను అర్జీదారుల సమక్షంలో పరిష్కరించాలని చెప్పారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు హాస్టల్ భవనాలు(పాత ఎస్పీ కార్యాలయం)లను అప్పగించాలని విద్యార్థులు వినతి పత్రం అందజేశారు. వినతులను సంబంధిత అధికారులకు అందించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే:** పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలపై క్షేత్ర స్థాయిలో విచారించి నిబంధనల మేరకు శాశ్వత పరిష్కారం చూపుతామని పీలేరు ఆర్డీవో విజయలక్ష్మి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలకు రెవెన్యూ సేవలను అందించి నమ్మకాన్ని పెంపొందించాలని సిబ్బందికి సూచించారు. డీటీ కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన రెడ్డెన్నను సత్కరించిన ఎన్‌టీఏ ప్రతినిధులు

నిత్య విద్యార్థి రెడ్డెన్న

సంబేపల్లె, న్యూస్‌టుడే: మారుతున్న విద్యా వ్యవస్థకు అనుగుణంగా విద్యార్థుల్లో గుణాత్మక, నైపుణ్యాత్మక విద్యా బోధనలు అందించడంలో ఉపాధ్యాయుడు గౌనుపల్లి రెడ్డెన్న నిత్య విద్యార్థి అని జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నల్లమల రామాంజులు అన్నారు. సోమవారం రెడ్డెన్న ఉద్యోగ విరమణ సందర్భంగా సంబేపల్లె ఆదర్శ పాఠశాల్లో ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన్ను గజమాల, శాలువతో ఘనంగా సత్కరించారు. జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు సునీత, రాష్ట్ర అసోసియేషన్ నాయకులు కులశేఖర్‌రెడ్డి, మండల కమిటీ బాధ్యులు రామయ్య, లోకేష్, వెంకటేశ్వర్లు, రవీందర్ రాజు, రామానాయుడు, రుద్రనాయక్, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్, నాగరాజు, నాగేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు తక్షణమే పరిష్కరిస్తాం

వినతి స్వీకరిస్తున్న కమిషనర్

రాయచోటి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు పురపాలక సంఘ కమిషనర్ రమణారెడ్డి వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆరు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఇంటి పన్ను అధికంగా వస్తోందని ముగ్గురు వ్యక్తులు వినతి పత్రం అందజేశారు. పన్ను తగ్గేలా చర్యలు తీసుకోవాలని కోరగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. మరో ఇద్దరు తమ పేర్లపై మ్యుటేషన్ చేయాలని కోరారు. నీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రసవ ప్రణాళికతో తల్లీబిడ్డ క్షేమం

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తే సుఖ ప్రసవం జరిగి తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని మండలంలోని తలపుల పీహెచ్‌సీ వైద్యులు గిరీషా, చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగిన నవజాత శిశువులను సోమవారం వార్డుల్లో పరీక్షించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రు పాలు తాగించాలని, అవే శ్రీరామరక్ష అని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు నాగమ్మ, ఏఎన్ఎం ప్రమీల, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువును పరిశీలిస్తున్న వైద్యులు గిరీషా, చంద్రశేఖర్‌నాయక్

లక్కిరెడ్డిపల్లె: తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

శ్మశానవాటిక ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మందిళ్లపెల్ల కస్పా సర్వే నంబర్ 159లో శ్మశానవాటికను కొందరు ఆక్రమించుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దారు క్రాంతికుమార్‌కు గ్రామస్థులు రవి, రామాంజనేయులు, సుజాత, నాగేశ్వర, రమణయ్య, ప్రసాద్, కృష్ణయ్య వినతిపత్రం అందజేశారు. 2.8 ఎకరాల్లో దర్జాగా షెడ్డు వేసుకుని బోరు వేసి శ్మశానం లేకుండా చేశారని వాపోయారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. **సంబేపల్లె:** మండల పరిధి శెట్టిపల్లె గ్రామం దండూరివాండ్లపల్లె సమీపంలోని లాలాన్ చెరువును ఆక్రమిస్తున్నారని అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి పీజీఆర్ఎస్‌లో తహసీల్దారు సుబ్రహ్మణ్యంరెడ్డికి ఫిర్యాదు చేశారు. లాలాన్ చెరువును కొందరు మట్టి తరలించి చదును చేశారని, చెరువు కింద తనకు ఎక్కువ ఆయకట్టు ఉందని సదరు ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువును సర్వే చేసి సరిహద్దులు గుర్తించాలని కోరారు. **పీలేరు గ్రామీణ:** స్థానిక వ్యవసాయ సహకారం సంఘం కార్యాలయం స్థలంలో సర్వే నిర్వహించి హద్దులు గుర్తించాలని పీలేరు సింగిల్‌విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డెప్పరెడ్డి డీటీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని తిరుపతి మార్గం సర్వే నంబర్లు 534-1లో 30 సెంట్లు, 535లో 20 సెంట్లు స్థలం ఉందని, నూతన భవన సముదాయం నిర్మాణం చేపట్టేందుకు హద్దులు గుర్తించి, పొజిషన్ ధ్రువపత్రం మంజూరు చేయాలని ఆయన కోరారు.

ఆలయాభివృద్ధికి చర్యలు

విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: వాల్మీకిపురంలోని వాసవి అమ్మవారి ఆలయాభివృద్ధికి చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సూచించారని, ఈ మేరకు చర్యలు తీసుకుంటామని దేవాదాయ, ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. సోమవారం స్థానిక వాసవి అమ్మవారి ఆలయాన్ని మార్కెట్ కమిటీ ఛైర్మన్ కోసూరి చంద్రమౌళి, మాజీ సర్పంచి రాజేంద్రచారిలతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల పీలేరు నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషితో సీడీఎఫ్, శ్రీవాణి ట్రస్టుల ద్వారా రూ.13 కోట్లు నిధులు మంజూరు చేయించారన్నారు. త్వరలోనే ఇంజనీరింగ్ అధికారులను సంప్రదించి ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం నాయకులు సతీష్, రామ్మోహన్, ఆనందశెట్టి, శివ, రెడ్డెప్ప, నవీన్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల సంక్షేమ సదస్సు విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న దూదేకుల సంఘం వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఇందాదుల్లా

కలికిరి, న్యూస్‌టుడే: దూదేకుల సంక్షేమమే లక్ష్యంగా జిల్లా కేంద్రం మదనపల్లెలో జరిగే ఏపీ ముస్లిం దూదేకుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా సదస్సును జయప్రదం చేయాలని రాయలసీమ ప్రాంత దూదేకుల సంఘం వర్కింగ్ అధ్యక్షుడు డాక్టర్ ఇందాదుల్లా పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం కలికిరి కొత్తపేటలోని అక్షర పాఠశాల ఆవరణలో మండల శాఖ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఈ నెల 6వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు మదనపల్లె పట్టణం బెంగళూరు బస్టాండు జామియా మసీదు వద్ద ఉన్న షాదీమహల్‌లో జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ భాషా పాల్గొంటారని చెప్పారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పీర్ మొహమ్మద్, ఇతర రాష్ట్ర నాయకులు షేక్ షఫీ సాహెబ్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు షకీల్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి అక్బర్, కోశాధికారి, జిల్లా న్యాయ సలహాదారులు యహసానుల్లా తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

CHANGE OF NAME

I, **SHAIK MUNEERA** (Old Name), W/o SHAIK KHADER VALI, R/o D.No.30/41-7-5, Alimabad Street, Rayachoty, Annamayya Dist., A.P., I changed my name to **SHAIK KHAMARUNNISA**. Henceforth i will be known as **SHAIK KHAMARUNNISA** (New Name).

తిరగలేక పోతున్నాం

✦ ఇంకెన్నాళ్లో కష్టాలు
✦ అర్జీదారుల కన్నీటి వేదన

న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ

భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగినా పట్టించుకోలేదని అర్జీదారులు వాపోయారు.. మండలాల్లో కనీసం అధికారులు, సిబ్బంది తమను పట్టించుకోవట్లేదని కన్నీటిపర్యంతమయ్యారు.. అందుకే వ్యయప్రయాసలకోర్చి ఆర్డీవో కార్యాలయం వరకు వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు.. ఉన్నతాధికారులైనా స్పందించి తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

చలానా కట్టినా పట్టించుకోవట్లేదు

మాది కంభంవారిపల్లె. సర్వే నంబరు 139/3లో 1.61 ఎకరాల భూమి ఉంది. దీన్ని పక్క పొలం యజమాని కొంచెంకొంచెం ఆక్రమిస్తున్నారు. అదేమని అడిగితే కొలతలు వేసుకుని రాళ్లు నాటుకోమంటున్నారు. సర్వే చేసి హద్దులు గుర్తించాలని చలానా చెల్లించినా అధికారులు పట్టించుకోవట్లేదు. దీనిపై రెండేళ్లుగా తిరుగుతున్నా. - **సిద్దయ్య, కంభంవారిపల్లె**

సబ్ డివిజన్‌కు ఎదురుచూస్తున్నా..

మాది కలికిరి మండలం మునోళ్లపల్లె. సర్వే నంబరు 308/4లో 1.10 ఎకరాల భూమిని మా మామయ్య గంగిరెడ్డి.. పప్పిశెట్టి శ్రీనివాసులుశెట్టి వద్ద కొనుగోలు చేశారు. నా భర్త మృతితో ఆ భూమిని నా పేరిట బదిలీ చేశారు. జాయింట్ పట్టా ఉందని కొందరు ఇబ్బంది పెడుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారుల విచారణకు పిలుస్తున్నా వారు రావట్లేదు. మూడేళ్లుగా తిరుగుతున్నా న్యాయం జరగలేదు. **-నీలావతి, మునోళ్లపల్లె.**

ఐదేళ్లుగా పడిగాపులు..

మాకు పీలేరు పంచాయతీ సర్వే నంబర్లు 662/1బీలో 1,55 ఎకరాలు, మా అన్న కుమారుడు మేకల రవికుమార్‌రెడ్డి పేరిట 662/1సీలో 1.58 ఎకరాల భూమి తండ్రి నుంచి వారసత్వంగా వచ్చింది. ఈ భూమికి పట్టాదారు పాసుపుస్తకం కోసం ఐదేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. **-కృష్ణారెడ్డి, బందార్లపల్లె**

రీ సర్వేతో తరచూ తిప్పలు..

మాది వాల్మీకిపురం మద్రిపాడు పంచాయతీ ఎల్లారెడ్డిగారిపల్లె. నా భర్త పేరిట సర్వే నంబర్లు 209/3లో 1.30 ఎకరాలు, 209/4-3.55 ఎకరాలు, 210/3- 1.90 ఎకరాలు, 211/3లో 46 సెంట్లు, 6/1లో 50 సెంట్లు వెరసి 7.79 ఎకరాల భూమి ఉంది. భర్త, కుమారుడు మృతి చెందారు. రీ సర్వే సమయంలో ఇదే విస్తీర్ణాన్ని తగ్గించి 5.49 ఎకరాలుగా నమోదు చేశారు. తగ్గిన విస్తీర్ణం పట్టాదారు పాసుపుస్తకంలో నమోదు చేయించాలని మూడేళ్లుగా తిరుగుతున్నా. ఆర్‌వోఆర్ అప్పీల్‌కు వెళ్లమని రెవెన్యూ అధికారులు సలహా ఇస్తున్నారు. **-నిర్మలదేవి, మద్రిపాడు**

జాయింట్ ఎల్‌పీఎం నంబరు వేశారు..



గుర్రంకొండ మండలంలో నాకు వారసత్వంగా వచ్చిన ఆరెకరాల వ్యవసాయ భూమి ఉంది. దీన్ని 22ఏ నుంచి తొలగించి మళ్లీ హోల్డ్‌లో పెట్టారు. అప్పటినుంచి నేటివరకు ఎన్నిసార్లు ప్రయత్నించినా ఆన్‌లైన్‌లో 1బీ రావట్లేదు. దీంతోపాటు ఇతరుల పేరిట జాయింట్ ఎల్‌పీఎం నంబరుతో 12 ఎకరాలు నమోదు చేశారు. దీనిపై రుసుము చెల్లించా. సబ్ డివిజన్ చేసి ఎల్‌పీఎం నంబరు వేయాలి. మూడేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా. **-శ్రీనివాసులు, గుర్రంకొండ**

మోసం కేసులో భార్యాభర్తల అరెస్ట్

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే) : మండలంలోని ఎంపీపల్లె పంచాయతీ శ్రీనాథపురం కాలనీకి చెందిన నిందితులైన వెంకటరమణ, శంకరమ్మ దంపతులను నగదు మోసం కేసులో అరెస్ట్ చేసి, రిమాండుకు పంపామని ఎస్సై వెంకట శివకుమార్ సోమవారం తెలిపారు. వీరు గర్నిమిట్ట పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన మల్లికాంతమ్మ తదితరుల నుంచి రూ.22 లక్షలు తీసుకుని మోసం చేశారని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

గాలివీడు, న్యూస్‌టుడే: గోరాన్‌చెరువు పంచాయతీ పరిధిలోని ఓ డిగ్రీ కళాశాల వెనక కంప చెట్ల మధ్య జూదం ఆడుతున్న సమాచారంపై సోమవారం దాడి చేసి 13 మందిని అరెస్టు చేశామని ఎస్సై జె.నరసింహారెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.39,860 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, 11 చరవాణులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

మిఠాయి దుకాణం యజమాని అదృశ్యం

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు పట్టణం ఎల్‌బీఎస్ రోడ్డు అజంతా మిట్ట వద్ద ఉన్న ఒక మిఠాయి దుకాణం యజమాని ఏడు రోజుల కిందట అదృశ్యమయ్యారు. దీంతో దుకాణం యజమానికి రూ.30 లక్షల వరకు అప్పులు ఇచ్చిన వారు లబోదిబోమంటున్నారు. యజమాని ఏడాది కిందట కూడా అదృశ్యమై రెండు నెలల తరవాత వచ్చి దుకాణం తెరచి వ్యాపారం నిర్వహించారు. గతంలో అప్పులు ఇచ్చిన వారు రోజు దుకాణం వద్దకు వచ్చి అప్పు చెల్లించాలని ఇబ్బంది పెడుతుండటంతో ఆరు నెలల గడువు కోరాడు. కొందరు అప్పు చెల్లించాలని హెచ్చరించడంతో ఎవరికీ చెప్పకుండా కుటుంబంతో పాటు పారిపోయాడు. దుకాణం భవన యజమాని మరో వ్యక్తికి దాన్ని అద్దెకు ఇచ్చేశారు. దీంతో బాధితులు నగదు పోయిందని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై తమకు ఇప్పటివరకు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (Union Bank of India)
రీజనల్ ఆఫీస్
21/58, అనెక్స్ బిల్డింగ్, BSNL కాంపౌండ్, హెడ్ పోస్టాఫీస్ ప్రక్కన, ట్రంక్ రోడ్డు, కడప -516001

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1) క్రింద

Loan Account No. 560361000128732

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ ఫోర్స్ మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3 తో చదివే సదరు సెక్షన్ 13(2) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గాలివీడు బ్రాంచ్ (31252)** వారి అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు

1. ఋణగ్రహీత(లు): **M/s PMC జ్యూవెలర్స్, ప్రొప్రైటర్: శ్రీ పెర్నపాటి లోకేశ్వరాచారి,** డి.నెం.5/178, రవీంద్రనగర్, గాలివీడు గ్రామపంచాయతీ మరియు మండలం, అన్నమయ్య జిల్లా-516267
2. హామీదారులు: **శ్రీ పెర్నపాటి లోకేశ్వరాచారి, తండ్రి: శ్రీ పి. మోహనాచారి** డి.నెం.5/178, రవీంద్రనగర్, గాలివీడు గ్రామ పంచాయతీ మరియు మండలం, అన్నమయ్య జిల్లా-516267.
3. **శ్రీ పరమేశ్వర, తండ్రి: శ్రీ ఎం. విష్ణుమూర్తి** డి.నెం.4/37, టెంపుల్ స్ట్రీట్, మసపేట, రాయచోటి, అన్నమయ్య జిల్లా-516270.

వార్లను బకాయి సొమ్ము **రూ.29,55,546.77/-** (రూపాయలు ఇరవై తొమ్మిది లక్షల యాభై ఐదు వేల ఐదు వందల నలభై ఆరు మరియు డెబ్బై ఏడు పైసలు మాత్రమే) **+ వడ్డీ మరియు ఇతర ఖర్చులు** నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా వారిని కోరుతూ **తేది.02-06-2026** న డిమాండ్ నోటీసును జారీ చేసినారు.

ఋణగ్రహీత సదరు ఋణాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. కావున ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు రూల్ 8 తో చదివే సదరు చట్టం లోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన ఆస్తిని **తేది.29-08-2026** న **స్వాధీనం** చేసుకున్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతను ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైనను చెల్లించవలసిన బకాయిలు **రూ.29,55,546.77/-** (రూపాయలు ఇరవై తొమ్మిది లక్షల యాభై ఐదు వేల ఐదు వందల నలభై ఆరు మరియు డెబ్బై ఏడు పైసలు మాత్రమే) మరియు వడ్డీ,కాస్ట్స్ మొదలగునవితో సహా **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గాలివీడు బ్రాంచ్ (31252)** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి, ఇందుమూలముగా ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. బకాయిలకు చెల్లించిన మొత్తం ఏదైనా ఉంటే ఖాతాలో చివరి చెల్లింపు సమయంలో సర్దుబాటు చేయబడుతుంది.

సదరు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలు ప్రకారం ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తిని విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

స్థిరాస్తి వివరములు: అన్నమయ్య జిల్లా, గాలివీడు గ్రామ పంచాయతీ&మండలం, కదిరి-రాయచోటి రోడ్, రవీంద్ర నగర్,డి.నెం.5/178, సర్వే నెం.913/2లో ఉన్న 60చ.గ.విస్తీర్ణంగల నివాస స్థలం మరియు అందులోని గ్రౌండ్ ఫ్లోర్ భవనం,శ్రీ పెర్నపాటి లోకేశ్వరాచారి గారి పేరున కలదు. హద్దులు:తూర్పు:పార్థసారథి ఇల్లు,పడమర: కె.శాంతమ్మ ఇల్లు, ఉత్తరం: రాస్తా, దక్షిణం: కదిరి- రాజంపేట రోడ్డు

తేది: 29-08-2026, స్థలం: కడప — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

మదనపల్లె

• మదనపల్లె • తంబళ్లపల్లె • పుంగనూరు

ఎంపీడీవో కార్యాలయంలో జాబితాను చూపుతున్న ఎంపీడీవో ఫకృద్దీన్ సాహెబ్

తుది ఓటర్ల జాబితా ప్రచురణ

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా తుది ఓటర్ల జాబితాను స్థానిక ఎంపీడీవో కార్యాలయం, స్వర్ణ గ్రామాల్లో ప్రచురించినట్లు ఎంపీడీవో ఫకృద్దీన్ సాహెబ్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

నీటితొట్టె శుభ్రం

రామసముద్రం, న్యూస్‌టుడే: 'నీటి తొట్టె...పాచి పట్టె' సమస్యపై ఈనాడులో సోమవారం ప్రచురితమైంది. మాలేనత్తం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్ స్పందించారు. పశువుల తాగునీటి తొట్టెను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
మదనపల్లె పట్టణం: 80085 74611
పీలేరు గ్రామీణం: 80085 74958
పుంగనూరు: 80085 74622

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ? పత్రపల్లె మార్గంలోని రోడ్డుపై కంకర తేలి గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా తయారైంది. మరమ్మతులు చేపట్టాలి. **- మంజునాథ్, పత్రపల్లె తండా** ✓ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. **- అప్పాజీ, ఎంపీడీవో**

అంకితభావంతో పనిచేస్తే ఉత్తమ గుర్తింపు

ఉద్యోగ విరమణ పొందిన వారిని సత్కరించిన ఎస్పీ ధీరజ్, ఏఎస్పీ వెంకటాద్రి, అధికారులు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ఉత్తమ గుర్తింపు ఉంటుందని ఎస్పీ ధీరజ్ అన్నారు. సోమవారం సుండుపల్లె ఏఎస్ఐ ఎస్.వెంకటేశ్వర్లు, పీలేరు ఏఎస్ఐ జె.మల్లికార్జున, హెడ్‌క్వాటర్స్ ఆర్ఎస్ఐ ఎస్.అల్లావుద్దీన్ ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ ధీరజ్ వారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందేలా చూస్తామన్నారు. అదనపు ఎస్పీ(అడ్మిన్) ఎం.వెంకటాద్రి, ఎస్‌బీ సీఐ సదాశివయ్య, ఆర్ఐలు ఎం.రవికుమార్, కె.సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరగలేకున్నాం.. పరిష్కరించండయ్యా..!

❖ కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణ

కలెక్టరేట్ (మదనపల్లె గ్రామీణ), న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కాకపోవడంతో బాధితులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండస్థాయిలో సమర్పించిన అర్జీలకు సరైన సమాధానాలు, న్యాయం జరగడం లేదని ఆరోపిస్తున్నారు. పలుమార్లు అర్జీలు సమర్పించినా తమ సమస్య పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చి ఆన్‌లైన్ చేయించుకుంటున్న అర్జీదారులు

పరిహారం అందక..

బీకేపల్లిలోని సిరికల్చర్ కాలనీ వద్ద నా భార్య విజయకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఉంది. జాతీయ రహదారి 42 రహదారి నిర్మాణానికి స్థలం తీసుకున్నారు. ఇంత వరకు పరిహారం ఇవ్వడం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు. **- సుధాకర్, గుర్రప్ప నాయుడు వీధి, మదనపల్లె**

కళ్లు కనిపించవని కబ్జా చేశారు

మాకు పుట్టుకతో కళ్లు కనిపించవు. గుడుపల్లిలో పిత్రార్జితంగా సంక్రమించాల్సిన స్థలాన్ని దాయాదులు ఆక్రమించుకుంటున్నారు. వారసత్వంగా 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మా తండ్రి ఎనిమిదేళ్ల కిందట మృతి చెందారు. మాకు రావాల్సిన స్థలాన్ని ఆక్రమించుకున్నారు. అదే విధంగా మా పిన్ని స్థలం కూడా కబ్జాకు పాల్పడుతున్నారు.
- శంకర్‌రెడ్డి, ఆదిరెడ్డి, గుడుపల్లి, ములకలచెరువు

పంచాయతీ స్థలం ఆక్రమణ

1976లో దేవతానగర్‌లో ప్రైవేటు లేఅవుట్‌లో ప్రయోజనార్థం 28 కుంటల స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలాన్ని ప్రస్తుతం కొందరు అన్యాక్రాంతం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా దీనిపై పంచాయతీ అధికారులకు అర్జీలు సమర్పిస్తున్నాను. పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.
- శ్రీరాములు, దేవతానగర్, మదనపల్లె

90 సార్లు అర్జీ సమర్పించా..

పట్టణంలోని రోడ్డు ఆక్రమణలు తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. 26 అడుగుల రోడ్డును అధికారులు సర్వే చేశారు. ఆక్రమణలను గుర్తించి ఇప్పటి వరకు ఆక్రమణలపై అధికారుల స్పందన లేదు. 2024 నుంచి ఇప్పటి వరకు దాదాపు 90 సార్లు అర్జీలు ఇచ్చా. **- రఫీక్ అహ్మద్, గాంధీరోడ్డు, మదనపల్లె**

ఆన్‌లైన్ చేయడం లేదు

మా తాత పేరున ఉన్న భూమి నాకు పిత్రార్జితంగా సంక్రమించింది. మూడు వేర్వేరు సర్వే నంబర్లలో 1.50 ఎకరా వ్యవసాయ భూమి ఉంది. రెండు సర్వే నంబర్లలో ఆన్‌లైన్ చేశారు. మరో సర్వే నంబరులోని 19 సెంట్ల వ్యవసాయ భూమి నాపేరున మార్చడం లేదు. దాదాపు మూడేళ్లుగా తిరుగుతున్నాను. **- సుబ్రహ్మణ్యం, బసినాయనిపల్లి, పుంగనూరు**

భక్తిశ్రద్ధలతో పూజలు

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సంతగేటులోని వినాయకస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సంకటహర చతుర్థి సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అలంకరణ చేశారు. స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజించారు.

స్వామివారికి కుంభాభిషేకం

రామసముద్రం, న్యూస్‌టుడే: మూగవాడి గ్రామంలో వెలసిన పుండరీశ్వరస్వామికి సోమవారం గ్రామస్థులు కుంభాభిషేకం జరిపారు. వేద పండితులు ఆలయంలో పెద్దఎత్తున హోమాలు చేపట్టారు. సమృద్ధిగా వర్షం కురిసి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

స్థలాన్ని కేటాయించాలని డిమాండ్

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సోమవారం నిమ్మనపల్లె బస్టాండులో ఆటోడ్రైవర్లతో సమావేశం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ బస్టాండులో ఆటోలు నిలిపేందుకు ఆటో స్టాండుకు స్థలాన్ని కేటాయించాలన్నారు. ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముబారక్, సీపీఐ మండల కార్యదర్శి నరేశ్, యూనియన్ మండల నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె అభివృద్ధికి సహకరించండి

కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను సత్కరిస్తున్న శంకర్‌యాదవ్

మదనపల్లె విద్య, ములకలచెరువు, మదనపల్లె గ్రామీణ: తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని తంబళ్లపల్లె తెదేపా ఇన్‌ఛార్జి శంకర్‌యాదవ్ కోరారు. సోమవారం మదనపల్లెలో కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వారిని సత్కరించారు. నియోజకవర్గంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలన్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, పెద్దమండ్యం మండల కన్వీనర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. * నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించానని శంకర్‌యాదవ్ అన్నారు. సీతరాంబాబుకు.. మంత్రి లోకేశ్ నుంచి వచ్చిన రెండు సైకిళ్ల, ప్రశంసాపత్రాలను శంకర్‌యాదవ్ అందజేశారు.

ఓటరు పత్రాల పరిశీలన

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: ఓటర్ల డాక్యుమెంట్లను పురపాలక సంఘ కమిషనర్ ప్రమీల సోమవారం తన ఛాంబర్‌లో పరిశీలించారు. తప్పిపోయిన ఓటర్లు, జాబితాలో నమోదు చేసిన పేర్లలో తప్పులు దొర్లడం వంటి వాటిని గుర్తించి సంబంధిత ఓటర్లకు నోటీసులు పంపారు. మదనపల్లె పురపాలక సంఘ పరిధిలో 11,093 మంది ఓటర్లు వివిధ రకాల కారణాలతో ఓటు హక్కు పొందలేకపోయారన్నారు. సరైన ధ్రువపత్రాలు పొందుపరిచి ఓటు హక్కు పొందవచ్చని ఎన్నికల కమిషన్ సూచించడంతో కమిషనర్ కార్యాలయానికి వచ్చిన ఓటర్లు డాక్యుమెంట్లను పరిశీలించి సరిచూసుకుని ఓటుహక్కు పొందడానికి సిఫారసు చేశారు. మంగళవారం కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు.

పత్రాలు పరిశీలిస్తున్న కమిషనర్ ప్రమీల

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపల్ గిరిబాబు, అధ్యాపకుడు రవీంద్రనాథ్‌రెడ్డి

విద్యాసామగ్రి అందజేత

మదనపల్లె విద్య: బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫైనలియర్ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులకు ప్రిన్సిపల్ గిరిబాబు ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడు రవీంద్రనాథ్‌రెడ్డి విద్యార్థుల కోసం తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారన్నారు. కళాశాలలో అధ్యాపకులు విద్యార్థులపై ఎంతో శ్రద్ధ చూపుతూ వారి విద్యా ప్రయాణంలో బాసటగా నిలుస్తున్నారన్నారు. విద్యార్థులు సైతం అంతే బాధ్యతతో చదివి ఉత్తమ మార్కులు సాధించాలన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

మదనపల్లె గ్రామీణ: వేతన బకాయిలు చెల్లించాలని కొత్తిండ్లు పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. కొత్తపల్లి-3లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గత రెండు నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. దీనిపై ఆధారపడి జీవిస్తున్న తమకు జీతభత్యాలు ఇవ్వకపోతే కుటుంబ పోషణ ఎలా సాగించాలని ప్రశ్నించారు. దీనిపై విచారించి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఇమ్రాన్, విజయమ్మ, నాగేశ్వరి, లక్ష్మిదేవి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ప్రతిష్ఠ మరింత పెంచుదాం

సోమల, న్యూస్‌టుడే: పుంగనూరు నియోజకవర్గ నూతన బాధ్యుడిగా నియమితులైన మధుసూదన్‌నాయుడు స్వగ్రామమైన ఇరికిపెంట పంచాయతీ మేటిమందకు సోమవారం వెళ్లారు. తల్లిదండ్రుల నుంచి ఆశీర్వాదం తీసుకొన్నారు. ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సాంబయ్య, జిల్లా మాజీ సర్పంచుల సంఘ అధ్యక్షుడు మధుశేఖర్‌నాయుడు, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి సురేష్ తదితరులు పాల్గొన్నారు. **చౌడేపల్లె:** కార్యకర్తలందరూ ఐకమత్యంగా పనిచేద్దాం గ్రామస్థాయిలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠను పెంచుదామని మధుసూదన్‌నాయుడు పేర్కొన్నారు. మండల స్థాయి నాయకులు గువ్వల రమేష్‌రెడ్డి స్వగృహంలో మండలంలోని కార్యకర్తలందరూ ఆయనకు స్వాగతం పలికారు.

మేటిమందలో తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న మధుసూదన్‌నాయుడు

వ్యాధి నివారణకు టీకా తప్పనిసరి

తంబళ్లపల్లె, ములకలచెరువు: ముద్దచర్మ వ్యాధి నివారణకు టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి విక్రమ్‌రెడ్డి తెలిపారు. సోమవారం తంబళ్లపల్లె మండలంలోని 21 పంచాయతీల్లో పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణకు ముందస్తుగా 10,500 డోసులు టీకా వేసినట్లు తెలిపారు. ఆగస్టు 1 నుంచి 31 వరకు ప్రతి గ్రామాల్లో సిబ్బంది సహకారంతో ముద్దచర్మ వ్యాధి టీకా వేసినట్లు తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండల ఎమ్మార్పీఎస్ కమిటీ అధ్యక్షుడిగా జి.కిరణ్, పట్టణ అధ్యక్షుడిగా గణేష్, ఎంఎస్పీ అధ్యక్షుడిగా వేణులను ఎంపిక చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యదర్శి భవానీ వెంకటేశ్ అధ్యక్షతన స్థానికంగా జరిగిన సమావేశంలో కొత్త కమిటీల ఎన్నికను నిర్వహించారు.

భూములు కేటాయించాలి

సదుం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీటీ ముద్దుకృష్ణయాదవ్ తెలిపారు. మండలంలోని గాండ్లపల్లెలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమకు భూములు కేటాయించాలని కోరారు. కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్, వార్డెన్ షరీఫ్‌అహ్మద్, సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

వదిలేస్తే శిథిలం.. ఉపయోగిస్తే పదిలం

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వనమలదిన్నె గ్రామ నడిబొడ్డున ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం భవనం ప్రస్తుతం ముళ్ల చెట్ల మధ్య నిరుపయోగంగా దర్శనమిస్తోంది. దీంతో విషపురుగుల బెడద అధికమవుతోంది. సమీపంలోనే జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. సంబంధిత అధికారులు భవనాన్ని సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఇన్నోవేషన్ నెక్సస్, హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

కురబలకోట, మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాల ద్వారా ప్రాక్టికల్ జ్ఞానాన్ని పెంచుకోవాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఈసీఈ విభాగం ప్రొఫెసర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయంలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ నెక్సస్-2026, హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హ్యాకథాన్ ద్వారా విద్యార్థుల్లో సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్, సృజనాత్మకత, ఆవిష్కరణ, ప్రాజెక్టు అభివృద్ధి వంటి నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. అనంతరం 170 మంది విద్యార్థులు 50 బృందాలుగా ఏర్పడి వివిధ నైపుణ్యాలను ప్రదర్శించారు. మొదటి స్థానంలో టెక్ విజన్ మిట్స్‌కు రూ.25వేలు, రెండో స్థానంలో నిలిచిన టీమ్ ఏజీఎస్ మిట్స్‌కు రూ.15వేలు, మూడో స్థానంలో నిలిచిన టీమ్ కేఎంపీఏవో ఇన్నోవేటర్ మిట్స్‌కు రూ.10వేలు నగదు బహుమతి అందజేశారు. వీసీ సి.యువరాజ్, ఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ సునీత, పాత్ విజన్ ఇన్నోవేషన్ ప్రైవేటు లిమిటెడ్ వ్యవస్థాపకుడు యతీంద్రనాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ రామనాథన్, విభాగాధిపతి సంజయ్‌కుమార్, సమన్వయకర్తలు సిమాద్రిబదత్యా, నూరుల్, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని మహిళల నిరసన

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని అగ్రహారం గ్రామానికి చెందిన మహిళలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అధికారులు వ్యవసాయ బోరుతో నీటిని అందిస్తున్న సమయానికి నీరు రాకపోవడంతో కూలీ పనులకు వదులుకోవాల్సి వస్తోందని వాపోయారు.

ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కార్మికుడికి తీవ్ర గాయాలు

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: టీ.సదుం పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు ముగించుకొని నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. కర్నూలు జిల్లా గూడురుకు చెందిన షహన్‌షావలీని గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన ఆయన్ను బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అద్భుతంగా.. ఆకట్టుకునేలా

❖ పీఎంశ్రీ పాఠశాలల్లో ఆధునిక విద్యా బోధన

డిజిటల్ బోర్డుపై పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పీఎంశ్రీ పాఠశాలల్లో సరికొత్తగా, వినూత్నంగా క్లిక్కర్స్ విధానంలో బోధన చేస్తున్నారు. తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బోర్డుపై ఒక ప్రశ్న ఇచ్చి సమాధానాన్ని క్లిక్కర్స్ పరికరంతో నమోదు చేయిస్తున్నారు. ప్రశ్నకు ఏది సరైన సమాధానం, ఎంత మంది సరిగా ఇచ్చారు అన్నది బోర్డుపై రాసిన వారి పేరు వస్తాయి. సరైన సమాధానం ఏంటి అన్నది సమగ్రంగా వివరించేలా ఆధునిక విద్యా బోధనను ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు.

సామర్థ్యాలను తెలుసుకునేందుకు

అడివినాథునికుంట ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థుల పేర్లతో ఒక్కొక్కరికి ఒక్కో క్లిక్కర్ పరికరాన్ని సమకూర్చారు. ప్రైవేటు పాఠశాలల్లో సైతం లేని ఆధునిక విద్యా బోధనను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తరగతి గదిలో బోధించే పాఠ్యాంశాలు విద్యార్థులకు ఎంత వరకు అర్థమయ్యాయో తెలుసుకునేందుకు ఉపాధ్యాయులు పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఇది ఎక్కువగా ప్రైవేటు పాఠశాలల్లో చూస్తుంటాం. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈ తరహా పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ రమా తెలిపారు.

విషయ పరిజ్ఞానం పెరుగుతోంది

క్లిక్కర్ పరికరంతో బోర్డుపై ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్నాం. పాఠ్యాంశాల్లో అంశాలపై వెంటనే పరీక్షలు పెట్టడం దీనికి సరైన సమాధానాలు ఏంటన్నది వెంటనే తెలుస్తుంది. దీని వల్ల విషయ పరిజ్ఞానం పెరుగుతుంది. కొత్త విషయాలు నేర్చుకుంటున్నాం. **- మేఘన, విద్యార్థిని**

తప్పొప్పులు తెలుసుకుంటున్నాం

సమాధానాలు ఇస్తున్న సమయంలో తప్పులు పెడితే సరైన సమాధానం ఏంటో సమగ్రంగా ఆన్‌లైన్‌లో క్లిక్కర్స్ పరికరంతో వివరించేలా డిజైన్ చేశారు. ఏ సందేహాలు అడిగినా సమాధానాలు ఇచ్చేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. తప్పొప్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం.
- హన్సిక, విద్యార్థిని

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మాట్లాడుతున్న పులివెందుల మున్సిపల్ మాజీ ఛైర్మన్ వరప్రసాద్

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని పులివెందుల మాజీ మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని కమతంపల్లె వ్యవసాయ క్షేత్రంలో విముక్తి జాతుల విమోచన దినోత్సవం నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది బేబిరాణి మాట్లాడుతూ.. చట్టసభల్లో వడ్డేరులకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు హేమచంద్ర, సుబ్రహ్మణ్యం, రమణ, చిత్తూరు మణి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు పవన్‌కల్యాణ్ పుట్టినరోజు.. మదనపల్లె పట్టణం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజును మదనపల్లెలో బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఏఎంసీ ఛైర్మన్ జంగాల శివరామ్, జనసేనపార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేశ్ సోమవారం వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆ పార్టీ రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి ఆధ్వర్యంలో పట్టణంలోని మిషన్ కాంపౌండ్ నుంచి ర్యాలీ ప్రారంభమై చిత్తూరు బస్టాండు, టౌన్‌బ్యాంకు కూడలి, బెంగళూరు బస్టాండు, ఎన్టీఆర్ కూడలి, నీరుగట్టువారిపల్లె మీదుగా శ్రీదేవి గార్డెన్స్ వరకు కొనసాగుతుందన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేశ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

గురుప్రసాద్‌కు అరుదైన గౌరవం

పట్టా అందుకుంటున్న గురుప్రసాద్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మదనపల్లె శ్రీ జ్ఞానాంబికా డిగ్రీ కళాశాల (అటానమస్) కరస్పాండెంట్ గురుప్రసాద్‌కు రాంచీలోని వైబీఎన్ యూనివర్సిటీ వారు మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టా అందజేశారు. ఆయన సంస్థాగత వాతావరణ, ఉద్యోగుల పని వాతావరణం, స్థిరమైన అభివృద్ధి అంశాల మధ్య ఉన్న సంబంధాన్ని తన పరిశోధనలో విశ్లేషించారు. బెంగళూరులో ఎంపిక చేసిన ఐటీ కంపెనీలను కేస్ స్టడీగా తీసుకుని పరిశోధన నిర్వహించారు. రామన్ దూబే పర్యవేక్షణలో చేయడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. గురుప్రసాద్‌ను ప్రిన్సిపల్ రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

స్థల వివాదంపై చర్యలు తీసుకోండి

కలెక్టరేట్ (మదనపల్లె గ్రామీణ), న్యూస్‌టుడే: స్థల వివాదంపై చర్యలు తీసుకోవాలని చల్లావారిపల్లి గ్రామస్థులు డిమాండ్ చేశారు. గ్రామస్థులు కలెక్టరేట్‌లో నిశాంత్‌కుమార్‌కు అర్జీ సమర్పించారు. వీరు మాట్లాడుతూ.. తమ పూర్వీకుల నుంచి గ్రామ కంఠంగా ఉన్న భూములున్నాయన్నారు. ఇందులో రెండు సెంట్ల భూమిలో పూర్వీకుల కాలం నుంచి కులమతాలకు అతీతంగా పండగలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం సంబంధిత భూమిలో ఓ వర్గానికి చెందిన వారు తమ గురువులకు ఇళ్లు నిర్మించుకునేందుకు తహసీల్దారుకు దరఖాస్తు చేశారని, దీనిపై కేవలం అయిదు మందితో విచారణ చేశారన్నారు. దీన్ని విచారించి ఇరు వర్గాల మధ్య ఎటువంటి విభేదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

నూతన కమిటీలతో ఐక్యంగా పనిచేద్దాం

ములకలచెరువు, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన మండల కమిటీలు ఐక్యతతో పని చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కోఇన్‌ఛార్జి మధు అన్నారు. సోమవారం ములకలచెరువు వెలుగు కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నూతన కమిటీల ఎంపిక సమావేశం నిర్వహించారు. గో టూ విలేజ్ కార్యక్రమం ద్వారా అన్ని గ్రామీణ ప్రాంతాలలో కమిటీలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మల్లికార్జున, అధికార ప్రతినిధిగా ప్రవీణ్‌కుమార్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా వెంకటనారాయణ, అధికార ప్రతినిధిగా రమణలను ఎంపిక చేసినట్లు తెలిపారు. నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ వాహనాలు నియంత్రించాలని డిమాండ్

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండులో ప్రైవేటు వాహనాల రాకపోకలను నియంత్రించాలని రెండో డిపోలోని యూనియన్ నాయకులు ట్రాఫిక్ మేనేజరు సిరాజ్‌కు విజ్ఞప్తి చేశారు. యాజమాన్యం ఆదేశాల మేరకు రెండో డిపో కార్యాలయంలో సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. యూనియన్ నాయకులు సీఏబాబు, మునికృష్ణ మాట్లాడుతూ బస్టాండు ఆవరణం ప్రైవేటు వాహనాల రాకపోకలకు నిలయంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు పూల శ్రీనివాసులు, సురేష్, బాబాజాన్, పోలయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలని వినతి

మదనపల్లె గ్రామీణ: పీలేరులోని ప్రైవేటు ఆసుపత్రిపై సమగ్ర విచారణ నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు రెడ్డిసాహెబ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమృతతేజ్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నగేశ్ సోమవారం జేసీ శివనారాయణశర్మకు అర్జీ సమర్పించారు. ఆగస్టు 26న ఓ వ్యక్తి అనారోగ్యంతో ఆసుపత్రిని ఆశ్రయిస్తే కిడ్నీకి సంబంధించి వైద్య చికిత్సలు అందించారన్నారు. సంబంధిత వ్యక్తి పరిస్థితి విషమించడంతో వైద్యులు తిరుపతి రెఫర్ చేయగా అప్పటికే మృతిచెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారన్నారు. ఈ మృతిపై సంబంధిత ప్రైవేటు ఆసుపత్రిపై విచారణ నిర్వహించాలన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగిన వ్యక్తికి జైలుశిక్ష, జరిమానా

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ మదనపల్లె స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ సోమవారం తీర్పు చెప్పారని రెండో పట్టణ ఎస్సై నాగేశ్వర్‌రావు తెలిపారు. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన గోవర్ధన్ ఆగస్టు 24న మద్యం తాగి వాహనం నడుపుతుండగా అరెస్టు చేసి జైలుకు తరలించామని చెప్పారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో రెండ్రోజుల జైలుశిక్ష, రూ.11 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని పేర్కొన్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: పెంచుపాడు పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కింద నిర్మించిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం నిరుపయోగంగా మారింది. ఒక్కో డంపింగ్ యార్డుకు రూ.2.50లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చుచేశారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో ఈ కేంద్రాల నిర్వహణ చేపట్టడం లేదు. దీంతో నిరుపయోగంగా, అలంకారప్రాయంగా ఉంది.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

సోమల, న్యూస్‌టుడే: వ్యాప్తి చెందే ఎయిడ్స్, క్షయ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్ఈవో మహమ్మద్ రఫీ సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యువజన మాసోత్సవాలు, నేత్ర పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ప్రిన్సిపల్ అమరేంద్రకుమార్ అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. యువత నేత్రదానం, రక్తదానం తదితర సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలన్నారు. సీహెచ్‌వో అమర్‌నాథ్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి గౌతమ్, పర్యవేక్షకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న సహాయ హెచ్ఈవో మహమ్మద్ రఫీ, ప్రిన్సిపల్ అమరేంద్రకుమార్

LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA

70th వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు

ఖాతాదారులకు విశేష సేవలు అందిస్తూ గత 70 సంవత్సరాలుగా మీ భవిష్యత్తు మా బాధ్యత అనే నినాదంతో అప్రతిహతంగా ముందుకుపోతున్న LIC ఆఫ్ ఇండియా 70వ సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

ఎస్.మస్తాన్
LIC Advisor, మదనపల్లి.
Cell : 9866012515